నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA
Digital Editions
www.nirbhayavaartha.in
https://nirbhayavaartha.in

# నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA TELUGU DAILY




సంపుటి : 13 సంచిక : 79 రంగారెడ్డి గురువారం 16 జులై 2026 ఎడిటర్ : బవనారి రవికుమార్ 16-07-2026 Thursday పేజీలు : 8 వెల : రూ॥ 1-00

Circulated To: Hyderabad-Rangareddy-Nizamabad-Warangal-Mulugu-Yadadri-Nalgonda-Karimnagar-Khammam-Medak-Sangareddy- Siddipet-Medchal-Jagityal-Vemulawada

## జీవితాల్లో మార్పు తెచ్చేది చదువొక్కటే..

### సీఎం రేవంత్ రెడ్డి ఇంట్రెస్టింగ్ కామెంట్స్



నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్:
కుటుంబాలలో ఆనందం నింపేది, మనుషుల జీవితాలను మార్చేది కేవలం చదువొక్కటేనని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా కొత్తకోటలో నూతనంగా నిర్మించిన బాలికల హైస్కూల్‌ను మంత్రులతో కలిసి ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి విద్యా వ్యవస్థ పునర్నిర్మాణంపై పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

**అందుకే విద్యాశాఖను నా దగ్గర..**
విద్య ప్రాధాన్యతను గుర్తించే తాను విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్నానని సీఎం తెలిపారు. గత పదేళ్ల ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ బడుల్లో కనీస సదుపాయాలు కరువయ్యాయని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో ఒకే కుటుంబం కీలక శాఖలన్నింటినీ తమ గుప్పిట్లో పెట్టుకుందని ఆరోపించారు. తెలంగాణ ఏర్పాటు వెనుక విద్యార్థుల ఉద్యమాలు, ఆత్మబలిదానాలు ఉన్నాయని.. రాజకీయ నాయకుల వల్ల కాకుండా విద్యార్థుల (మిగతా 3లో..)

## కేంద్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు

### 7 కీలక ప్రాజెక్టులకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం

ఢిల్లీ: నిర్భయవార్త ప్రతినిధి :
భారతదేశ పారిశ్రామిక, మౌలిక సదుపాయాల రంగాలను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం బుధవారం అత్యంత కీలకమైన నిర్ణయాలు తీసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో మొత్తం రూ.2,19,353 కోట్ల విలువైన ఏడు భారీ ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. దేశాన్ని సెమీకండక్టర్ల తయారీలో గ్లోబల్ హబ్‌గా మార్చడం, మొబైల్ ఉత్పాదనను పెంచడం, ఎరువుల రంగంలో స్వయంసమృద్ధి సాధించడంతో పాటు వారణాసిలో ప్రతిష్ఠాత్మక ఇన్‌ఫ్రా ప్రాజెక్టులకు ఈ సమావేశంలో గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. క్యాబినెట్ భేటీ అనంతరం కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన ఆ 7 కీలక నిర్ణయాల పూర్తి వివరాలు ఇవే:

1. సెమీకాన్ 2.0– రూ.1,27,500 కోట్లు
భారతదేశాన్ని అంతర్జాతీయ చిప్ తయారీ కేంద్రంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం 'సెమీకండక్టర్ మిషన్ 2.0' ను ప్రకటించింది. దీని కోసం ఏకంగా రూ.1,27,500 కోట్ల భారీ బడ్జెట్‌ను కేటాయించింది. ఈ నిర్ణయం ద్వారా దేశంలో అత్యాధునిక సెమీకండక్టర్ ప్లాంట్ల ఏర్పాటు, డిజైనింగ్, ప్యాకేజింగ్ పరిశ్రమలకు భారీగా ప్రోత్సాహం లభించనుంది.

2. మొబైల్ ఫోన్ మాన్యుఫ్యాక్చరింగ్ స్కీమ్ – రూ.62,500 కోట్లు
ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో భారత్ సాధిస్తున్న దూకుడును మరింత పెంచేందుకు రూ.62,500 కోట్ల కేటాయింపుతో 'మొబైల్ ఫోన్ మాన్యుఫ్యాక్చరింగ్ స్కీమ్'కు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ పథకం ద్వారా స్థానిక మొబైల్ ఉత్పత్తి పెరగడమే కాకుండా, భారీగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

3. యూరియా జాతీయ పెట్టుబడి విధానం–2026
ఎరువుల రంగంలో భారతదేశాన్ని స్వయం సమృద్ధి దేశంగా మార్చేందుకు, విదేశీ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు 'నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ పాలసీ ఫర్ యూరియా–2026' కు కేంద్రం ఆమోదముద్ర వేసింది. దీని ద్వారా దేశీయంగా యూరియా ఉత్పత్తిని పెంచి రైతులకు కొరత లేకుండా చేయనున్నారు (దీనికి ప్రత్యేకంగా ఆర్థిక కేటాయింపులు



కాకుండా విధానపరమైన ఆమోదం తెలిపారు).

4. వారణాసి (కాశీ) ఇన్‌ఫ్రా ప్రాజెక్టులు -- రూ.25,446 కోట్లు
పవిత్ర పుణ్యక్షేత్రం వారణాసి రూపురేఖలను మార్చేలా రెండు భారీ ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి కేంద్రం అనుమతి ఇచ్చింది. వరుణా నది ఎలివేటెడ్ కారిడార్: రూ.10,998 కోట్ల వ్యయంతో వరుణా నది వెంబడి 6/4 లేన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తారు. గంగా నది ఎలివేటెడ్ కారిడార్: రూ.14,448 కోట్ల వ్యయంతో గంగా నది వెంబడి 6 లేన్ల అత్యాధునిక ఎలివేటెడ్ కారిడార్‌ను చేపట్టనున్నారు.

5. రైల్వే మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు -- రూ.3,907 కోట్లు
దేశంలో సరుకు రవాణా, ప్రయాణికుల రాకపోకలను మరింత సులభతరం చేసేందుకు రెండు కీలక రైల్వే లైన్ల ప్రాజెక్టులకు క్యాబినెట్ ఓకే చెప్పింది. పారాదీప్–హరిదాస్‌పూర్ రైల్వే లైన్: రూ.2,542 కోట్ల అంచనా వ్యయంతో ఈ రైల్వే లైన్ డబ్లింగ్ (రెండో లైన్) పనులను చేపడతారు. డాంగోవాపోసి–రాజ్‌ఖర్సవాన్ నాలుగో లైన్: రూ.1,365 కోట్ల పెట్టుబడితో ఈ మార్గంలో నాల్గవ రైల్వే లైన్ నిర్మాణానికి ఆమోదం తెలిపారు.
బుధవారం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు కేవలం పారిశ్రామిక రంగానికే కాకుండా మౌలిక సదుపాయాల కల్పనకు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు (యూరియా పాలసీ ద్వారా) ఊతమిచ్చేలా ఉన్నాయి. ముఖ్యంగా సెమీకండక్టర్, మొబైల్ తయారీ రంగాలు గ్లోబల్ మార్కెట్‌లో భారతదేశ స్థానాన్ని మరింత పటిష్ఠం చేయనున్నాయని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.

## ఈనెలలోనే 50 నామినేటెడ్ పోస్టుల భర్తీ..

**టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కీలక ప్రకటన**



నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్:
ఈ నెలలోనే 50 నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. బుధవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. గతంలో పనితీరు కనబరిచిన వారిని రెన్యూవల్ చేసే అవకాశం ఉందన్నారు. డీసీసీల పనితీరు బాగోలేకపోతే మార్చే అవకాశం ఉందని వెల్లడించారు. పార్టీ పదవులపై మీనాక్షి నటరాజన్‌తో చర్చించామని తెలిపారు. రెండు రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అవుతామన్నారు. రెన్యువల్ విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. మండల కమిటీలో డీసీసీల రిపోర్ట్ ఫైనల్ అని స్పష్టం చేశారు. ఎంపీ రేణుకా చౌదరితో మాట్లాడానని మహేశ్ తెలిపారు. 'తాను మాట్లాడిన ఉద్దేశం వేరని నాతో అన్నారు. ఖమ్మంలో బీజేపీ, బీఆర్ఎస్ రెండూ కూడా కాంగ్రెస్ వైపు చూస్తున్నాయని అన్నట్లు రేణుక నాతో చెప్పారు.. కానీ ఆ వ్యాఖ్యలపై (మిగతా 3లో..)

## తెలంగాణలో ఎస్ఐఆర్ గడువు పొడిగింపు




నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్:
తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన చేసింది. బూత్ స్థాయి అధికారులు ఇప్పటికే జూన్ 25 నుంచి ప్రారంభించిన ఇంటింటి సర్వే ప్రక్రియ ఆగస్టు 3 వరకు కొనసాగుతుందని ప్రకటించింది. దీనికి సంబంధించి సరికొత్త షెడ్యూల్‌ను కూడా విడుదల చేసింది. తాజా ఉత్తర్వుల ప్రకారం ఆగస్టు 10న రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల ముసాయిదా జాబితా అధికారికంగా విడుదల కానుంది. ముసాయిదా జాబితా విడుదలైన తర్వాత, కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు, మార్పులు–చేర్పులకు సంబంధించిన అభ్యంతరాల స్వీకరణకు ఎన్నికల సంఘం నెల రోజుల పాటు గడువునిచ్చింది. ప్రజలు ఆగస్టు 10 నుంచి సెప్టెంబర్ 9 వరకు తమ దరఖాస్తులను సమర్పించే అవకాశం కల్పించారు. ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలకు సంబంధించిన నోటీసుల జారీ, వాటి పూర్తి స్థాయి పరిష్కార (మిగతా 3లో..)

## ఫార్చ్యూన్ కంపెనీలకు హబ్‌గా హైదరాబాద్: సీఎం రేవంత్ రెడ్డి

నిర్భయవార్త ప్రతినిధి :హైదరాబాద్:
ఫ్యూచర్ సిటీలో అమెజాన్ కొత్త డేటా సెంటర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. 2047 కల్లా 3 ట్రిలియన్ ఎకానమీకి చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. భారత జీడీపీకి 10శాతం అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. కాలుష్యరహిత నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతామని చెప్పారు.
(మిగతా 3 లో..)




## జవహర్‌నగర్ డంప్‌యార్డ్ తరలింపు వరకు పోరాటం ఆగదు

### మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

నిర్భయవార్త ప్రతినిధి : మేడ్చల్:



జవహర్‌నగర్ డంప్‌యార్డ్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమానికి పూర్తి మద్దతు ఇస్తానని, సమస్య పరిష్కారమై డంప్‌యార్డ్ తరలించే వరకు ప్రజలతో కలిసి పోరాటం కొనసాగిస్తానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. బుధవారం శామీర్‌పేట్‌లోని తన నివాసంలో జవహర్‌నగర్ డంప్‌యార్డ్ వ్యతిరేక అఖిలపక్ష నేతలు, జేఏసీ నాయకులు, స్థానిక ప్రజలు ఎంపీని కలిసి తమ ఉద్యమానికి నాయకత్వం వహించాలని కోరారు. గత 20 ఏళ్లుగా డంప్‌యార్డ్ కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడిందని వారు వివరించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. పార్టీలు, జెండాలకు అతీతంగా ప్రజలు ఏకమవడం అభినందనీయమన్నారు. డంప్‌యార్డ్ సమస్యపై తాను ఎప్పటి నుంచో పోరాడుతున్నానని, గతంలో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను అమలు చేయకపోవడం వల్లే పరిసర ప్రాంతాలు విషవలయంగా మారాయని ఆరోపించారు. మూసీ నది కంటే దారుణమైన పరిస్థితి డంప్‌యార్డ్ పరిసరాల్లో నెలకొందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఉద్యమమే మార్గమని, జేఏసీ పిలుపునకు స్పందించిన వారిని అరెస్టు చేయడం సమస్యకు పరిష్కారం కాదన్నారు.
(మిగతా 3 లో..)

## 'తెలంగాణ రక్షణ సేన' దూకుడు..

### 23 నియోజకవర్గాలకు ఇంచార్జీల ప్రకటన

నిర్భయవార్త ప్రతినిధి :హైదరాబాద్:




తెలంగాణ రక్షణ సేన స్పీడు పెంచింది. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే దిశగా ఆ పార్టీ చీఫ్, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కీలక అడుగు వేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడత కింద 23 అసెంబ్లీ నియోజకవర్గాలకు పార్టీ ఇంచార్జీలను నియమిస్తూ బుధవారం అధికారిక ప్రకటన విడుదల చేశారు. పార్టీ వ్యవస్థాగత నిర్మాణంలో భాగంగా చేపట్టిన ఈ తొలి నియామకాల్లో కవిత తన లక్కీ నంబర్ సెంటిమెంట్‌ను ప్రతిబింబించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది.

**లక్కీ నంబర్ '5' వచ్చేలా తొలి విడత లిస్ట్..**
తాజా నియామకాల్లో పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత తన లక్కీ నంబర్ 5 వచ్చేలా వ్యూహాత్మకంగా వ్యవహరించారు. మొదటి విడతలో భాగంగా సరిగ్గా 23 మంది నియోజకవర్గ ఇంచార్జీల జాబితాను ఆమె ఖరారు చేశారు. సంఖ్యాశాస్త్రం ప్రకారం 23 సంఖ్యలోని ఆ అంకెలను కూడితే ఐదు వస్తుంది. తన లక్కీ నంబర్ కలిసివచ్చేలా కవిత ఈ సంఖ్యను ఎంచుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం నడుస్తున్న ఆషాఢ మాసంలో శుభ ముహూర్తాన (మిగతా 3 లో..)

నిర్భయవార్త

సంపాదకీయం

గురువారం 16 జులై 2026

## వాహనదారులకు షాక్

ఇథనాల్ కలిపిన పెట్రోల్‌ను వాహన వినియోగదారులపై బలవంతంగా రుద్దడం ఆందోళనకరం. ప్రస్తుతానికి ఇ-20 పెట్రోల్‌ను అందిస్తున్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఇథనాల్ శాతాన్ని మరింతగా పెంచుతూ ఇ - 85, ఇ - 100 కూడా తీసుకొచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తోందన్న ప్రచారం వాహన వినియోగదారులకు కలవరపాటే. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో డాలర్ల వినియోగాన్ని తగ్గించడానికి, రైతులకు ప్రయోజనకరంగా ఉండటానికి ఈ విధానాన్ని తీసుకొచ్చామంటున్న కేంద్రం ప్రకటనలు.. వాస్తవంలో కోట్లాదిమంది సామాన్య వాహనదారుల ప్రయోజనాలకు, రవాణా రంగానికి ప్రాణ సంకటం. తాజా విధానం భవిష్యత్‌లో ఆహార సంక్షోభానికి దారితీసే ముప్పు కాచుకుని వుంది. పెట్రోల్‌లో ఇథనాల్ వినియోగించడంపై దశాబ్దాలుగా చర్చ సాగినా, 2021లో నీతి ఆయోగ్ ఈ విధానాన్ని ఆమోదించింది. 2022లో నేషనల్ పాలసీ ఆఫ్ బయోఫ్యూయల్‌ను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకొచ్చింది. ఇథనాల్‌ను క్రమంగా పెంచుతూ ప్రస్తుతానికి ఇ - 20 అమలులోకి తీసుకొచ్చారు. 2023 తరువాత తయారైన వాహనాలు వీటిని వినియోగించుకోగలవని, అంతకు ముందు తయారైన వాహనాల ఇంజన్లు, రబ్బరుతో తయారు చేసిన పరికరాలు దెబ్బ తింటున్నాయని నిపుణులు చెబుతున్నారు. అందుకోసం కొన్ని కంపెనీలు ద్విచక్ర వాహన కిట్లను రూ.12 వేలకు పైగా, కార్ల కిట్లను రూ.25 వేలకు పైగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాయి. పాత వాహనాలను నడుపుకుంటూ బతుకు బండి లాగుతున్న సామాన్యుడు ఈ పరిణామాలను తట్టుకోవడం కష్టం. ఇ -20 వల్ల 3 - 5 శాతం మైలేజి తగ్గుతుందని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వశాఖే అంగీకరించింది. పూర్తి స్థాయిలో ఇథనాల్ వినియోగిస్తే మైలేజిలో 65 శాతమే వస్తుంది. ఇదే విధానాన్ని అనుసరిస్తున్న బ్రెజిల్ వాహనాల్లో వినియోగించే ఇథనాల్ ధరను పెట్రోల్ ధర కంటే 30 శాతం తక్కువకు విక్రయించడంతోపాటు ఏ ఇంధనం కొనుక్కోవచ్చో ఎంపిక చేసుకునే స్వేచ్ఛను వినియోగదారులకిచ్చింది. ఫ్లెక్సీ ఫ్యూయల్ వాహనాలకు ప్రోత్సాహకాలను అందిస్తోంది. ఇథనాల్ తయారీకి ఎక్కువ ఖర్చు, తయారీదారులకు పోత్సాహకాలు ఇస్తున్నందున రాయితీలేవీ ఇవ్వలేమని మోడీ సర్కారు చేతులెత్తేయడం సరికాదు. ఇ-20తోపాటు ఇ-10 పెట్రోల్‌ను కూడా అందుబాటులో ఉంచాలన్న వినియోగదారుల విజ్ఞప్తిని పెడచెవినపెట్టడం అసమంజసం. ఎం.ఎస్. స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయకుండా... ఇథనాల్‌తో రైతులకు ప్రయోజనం కల్పిస్తున్నామన్నది వట్టిమాటే! వ్యవసాయ విధానంలో భాగంగా ఉండాల్సిన ఇథనాల్ తయారీని స్వతంత్రంగా చూపడం అసమంజసం. పెట్రోల్‌లో ఇథనాల్ శాతం పెంచడం వల్ల విదేశీ మారకద్రవ్యం మిగులుతుందని, పర్యావరణానికి అనుకూలమని కేంద్రం చేస్తున్న వాదనలు కూడా అర్ధరహితమే. ఇథనాల్ తయారీలో 40 శాతం చెరకు, 50 శాతం మొక్కజొన్న, 10 శాతం ఎఫ్‌సిఐ గోడౌన్లలో నిల్వ చేసిన వాటిలో పాడైన ఆహార ధాన్యాలు, పంట వ్యర్థాలు వినియోగిస్తున్నారు. ఇవన్నీ అత్యధిక నీరు, ఎరువులు వినియోగించేవే. ఎరువులు, ఆహార ధాన్యాల దిగుమతులు పెరిగితే డాలర్ల మిగులేమీ ఉండదు. ఇథనాల్ శాతం పెరిగే కొద్దీ వీటి వినియోగం పెరుగుతుంది. ఒక లీటర్ ఇథనాల్ తయారీలో వినియోగించే చెరకుకు 3,630 లీటర్లు, మొక్కజొన్నకు 4,670 లీటర్లు, ధాన్యానికి 10,790 లీటర్లు నీరు అవసరం. ఎల్‌నినో వల్ల ఈ ఏడాది వర్షాభావం ఏర్పడుతుందన్న హెచ్చరికలు వచ్చాయి. ఇథనాల్ శాతం పెరగడం, అందుకోసం చెరకు, మొక్కజొన్న పంటల విస్తీర్ణం పెరగడం... నీటి అవసరాలను పెంచడంతోపాటు ఆహార సంక్షోభానికి కారణమయ్యే ప్రమాద ఘంటికలే. వ్యవసాయ వ్యర్థాలతో 2 జి ఇథనాల్ ఉత్పత్తి చేస్తామంటూ ప్రకటిస్తున్నా... అది ఖరీదైనది, సాంకేతికంగా మరింత క్లిష్టమైనది. సంక్షోభాలను ఎదుర్కొనే ముందు చూపులేకపోవడమే దేశానికి పెను ముప్పు. ఎన్‌డిఎ కు మద్దతిచ్చే ఓటర్లలో 50 శాతానికి పైగా ఇథనాల్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నారన్న సి ఓటర్ తాజా సర్వే కేంద్రం విధానంపై ఆగ్రహాన్ని ఎత్తిచూపేదే. స్వచ్ఛమైన పెట్రోల్ కంటే తక్కువ మైలేజీ ఇచ్చే ఇంధనం కోసం వినియోగదారులు ఎక్కువ చెల్లించవలసి రావడానికి పశ్చిమాసియా సంక్షోభం, డాలర్ల సమస్య ఒక సాకు కాకూడదు.

# హార్మూజ్ కీలకం!



ఇరాన్ అణుబాంబులు తయారు చేస్తోంది గనుక నిరోధించేందుకు తాము దాడులకు దిగినట్లు అమెరికా అధినేత డోనాల్డ్ ట్రంప్ ఈ ఏడాది మార్చిలో ప్రపంచాన్ని నమ్మించేందుకు చూశాడు. అంతకు ముందు 2025లో కూడా దాడులు చేసి అణు స్థావరాలను ధ్వంసం చేసినట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ మరోసారి ఎనిమిది నెలలకే దాడులకు దిగాడు. ఫిబ్రవరి 28న పశ్చిమాసియాలో ఇరాన్‌పై దాడులతో ట్రంప్ రేపిన చిచ్చును ఆరనివ్వకుండా కొనసాగిస్తూనే ఉన్నాడు. జులై 11న మరోసారి ప్రారంభమైన దాడులు-ప్రతి దాడులు మంగళవారం నాడు ఇది రాసిన సమయానికి కొనసాగుతూనే ఉన్నట్లు వార్తలు. సంక్షోభాలు, యుద్ధాలు కొనసాగితే అమెరికా కార్పొరేట్లకు కాసుల పంట పండుతుంది. అందుకే అవి నిత్యం ఎక్కడో ఒక చోట చిచ్చు పెట్టేందుకు చూస్తుంటాయి. అమెరికా కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం హార్మూజ్ జలసంధిలో సురక్షిత నౌకా ప్రయాణానికి భద్రత కల్పించాల్సిన బాధ్యత ఇరాన్‌కు అప్పగించారు. జూన్ 17న కుదిరిన ఒప్పందం ప్రకారం 60 రోజుల పాటు వాణిజ్య నౌకల రవాణా మీద ఎలాంటి సుంకాలు విధించకూడదు. దానిలో భాగంగా ఏ నౌక అయినా తమకు వివరాలు తెలిపి, తాము సూచించిన మార్గంలో ప్రయాణించాలని ఇరాన్ ప్రకటించింది. అయితే కొన్ని నౌకలు దీనికి భిన్నంగా ఎటువైపు వెళ్లేదీ తెలియనివ్వకుండా సంకేతాలను పంపే వ్యవస్థలను కట్టివేసి ప్రయాణిస్తుండటంతో అలాంటి నౌకలు హెచ్చరికలను ఖాతరు చేయకపోవటంతో ఇప్పటికి మూడు సార్లు కొన్ని నౌకల మీద ఇరాన్ డ్రోన్లతో దాడులు చేసింది. వాటిని సాకుగా చూపి అమెరికా పెద్ద ఎత్తున ఇరాన్‌పై బాంబుల వర్షం కురిపిస్తున్నది. దానికి ప్రతిగా గల్ఫ్‌లోని అమెరికా మిలిటరీ స్థావరాల మీద ఇరాన్ కూడా ధీటుగా ప్రతి దాడులు చేస్తున్నది. ఈ క్రమంలో ఇరాన్‌తో ఇంక చర్చలేవీ లేవన్న ట్రంప్ వెంటనే మాట మార్చి సాంకేతిక అంశాలపై ఉంటాయని చెప్పాడు. పాకిస్తాన్, కతార్, ఈజిప్టు రంగంలోకి దిగి మరోసారి చర్చల కోసం రావాలని ఇరు పక్షాలనూ కోరుతున్నాయి. అదేమీ తేలకుండానే అమెరికా రెచ్చగొట్టుడు కారణంగా హార్మూజ్ జలసంధిని మరోసారి మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. తాము కూడా దిగ్బంధనాన్ని తిరిగి కొనసాగించి ఇరాన్‌కు నౌకల రాకపోకలను అడ్డుకుంటామని ట్రంప్ ప్రకటించాడు. అంతే కాదు, హార్మూజ్ జలసంధిలో ప్రయాణించే నౌకల మీద వాటిలోని సరకు విలువలో 20 శాతం పన్ను విధిస్తానని కూడా ప్రకటించాడు. అంతకు ముందు ఇరాన్ పన్ను వసూలు చేస్తానని చెబితే వ్యతిరేకించిన పెద్ద మనిషి ఇప్పుడు తానే ఆ పని చేస్తానని చెప్పాడు. రోజువారీ దాడులు, ప్రతి దాడులు ఎదుటి పక్షాన్ని ఏ విధంగా దెబ్బతీసిందీ ఆయా దేశాలు చేస్తున్న ప్రకటనల వార్తలు తెలిసిందే. ఇరాన్ అణు, మిలిటరీ సామర్థ్యాన్ని పూర్తిగా నాశనం చేసినట్లు ట్రంప్ ఇప్పటి వరకు నలభై నుంచి యాభైసార్ల వరకు చెప్పి ఉంటాడు. అయినా అమెరికా స్థావరాల మీద ఇరాన్ దాడులు ఎలా చేయగలుగుతున్నదన్న అంశం అనేక మందికి అంతుబట్టటం లేదు. మానవ పరిణామ క్రమంలో అవసరాలే అనేక నూతన ఆవిష్కరణలకు దోహదం చేశాయి. ఇది ఇరాన్‌కూ వర్తిస్తుంది. వియత్నాంపై రెండున్నర దశాబ్దాల పాటు జపాన్, ఫ్రాన్సు, అమెరికా సామ్రాజ్యవాదులు భీకర దాడులు చేశారు. వారి మిలిటరీ, ఆయుధ సామర్థ్యాన్ని గెరిల్లా పోరాట పద్ధతులను అనుసరించి కమ్యూనిస్టులు ఎదిరించి నిలవటమే కాదు, 1975లో అమెరికన్లు దొరికిన విమానాలు, హెలికాప్టర్లను పట్టుకొని పారిపోయేట్లు చేశారు. ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబాన్ల చేతిలోనూ అమెరికాకు అదే పరాభవం ఎదురైంది. ఇప్పుడు ఇరాన్‌లో కూడా అమెరికాకు అదే జరుగుతోంది. అడవులు, కొండలు గుట్టల్లో గెరిల్లా పద్ధతి వేరు. సముద్రంలో కూడా ఇరాన్ ఆ విధానాన్ని అనుసరిస్తున్నది. ఆత్మరక్షణ-ప్రతిఘటన దాడి పద్ధతులను అభివృద్ధి చేసుకొన్నది. దీనికి ఇతర దేశాల అనుభవాలు నేర్పిన పాఠాలతో పాటు చైనా, రష్యా అందచేస్తున్న సహకారం కూడా తోడు కావటం, ఈ పరిణామాలను అమెరికా, ఇజ్రాయిల్ పసిగట్టలేకపోవటం కనిపిస్తున్నది. గూఢచర్యంలో ఈ రెండు దేశాల తరువాతే మిగతావి అన్నట్లు అనేక మంది కీర్తించటం తెలిసిందే. అలాంటి తోపులనే ఇరాన్ తప్పుదారి పట్టించి తనను తాను కాపాడుకుంటున్నది, ప్రతి దాడులు చేయగలుకుతున్నది. తన డ్రోన్లు, క్షిపణులు ఎక్కడ ఉన్నదీ తెలియకుండా కాపాడుకోవటమే కాదు, ప్రయోగ కేంద్రాలను కూడా ఎప్పటికప్పుడు మారుస్తూ శత్రువుల నిఘాను ఏమారుస్తున్నది. ఇరాన్ నౌకా దళాన్ని రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు ఒకసారి నాశనం చేశారు. తరువాత మరోసారి విధ్వంసం కావించారు. తాజాగా మూడవసారి అమెరికా మరికొంత నష్టం కలిగించింది. అయినా స్వల్ప ఖర్చుతో చిన్న పడవలతో హార్మూజ్ జలసంధిలో అమెరికాను ముప్పుతిప్పలు పెట్టటంలో ఇప్పటి వరకు ఇరాన్ జయప్రదమైంది. 1979లో తమ తొత్తు షాను గద్దె దించి అధికారానికి వచ్చిన ఇస్లామిక్ శక్తులను దెబ్బ తీసేందుకు 1980లో ఇరాక్‌ను రెచ్చగొట్టిన అమెరికన్లు ఇరాన్ మీద దాడులు చేయించారు. అవి 1988 వరకు కొనసాగాయి. ఇరాన్ చమురు ఎగుమతులను దెబ్బ తీయటం ఆ పోరు లక్ష్యాలలో ఒకటి. దానిలో భాగంగా టాంకర్ల మీద దాడులు, ప్రతి దాడులు జరగటంతో టాంకర్ల పోరుగా దాన్ని పిలిచారు. నాలుగు వందల చమురు టాంకర్ల మీద దాడులు జరగ్గా కొందరు సాధారణ పౌరులతో సహా రెండు వందల మందికి పైగా నావికులు మరణించారు. అప్పుడు కూడా హార్మూజ్ జలసంధిని దిగ్బంధనం చేసేట్లు ఇరాన్‌ను రెచ్చగొట్టినా ఆ నాడున్న పరిస్థితిలో అది జరగలేదు. ఇలా ఎన్నింటినో అధ్యయనం చేసిన ఇరాన్ హార్మూజ్ జలసంధిలో ఇప్పుడు కొరకరాని కొయ్యగా తయారైంది. ఇరాన్ రివల్యూషనరీ గార్డులకు ఒక అధినాయకత్వం ఉన్నప్పటికీ ప్రాంతీయ విభాగాలుగా వ్యవస్థలను ఏర్పాటు చేసి శత్రువులను దెబ్బ తీసేందుకు ఏ పద్ధతి వీలైతే దాన్ని అమలు చేసే స్వేచ్ఛ ఇచ్చారు. శత్రువును దెబ్బ తీయటమే అంతిమ లక్ష్యం. ప్రపంచ రవాణాలో పర్షియన్ గల్ఫ్ లేదా హార్మూజ్ జలసంధితో పాటు సూయజ్ కాలువ ద్వారా తూర్పు మధ్యధరా సముద్రంతో హిందూ మహా సముద్రాన్ని కలిపే ఎర్ర సముద్రం కీలక పాత్ర పోషిస్తున్నది. హార్మూజ్ జలసంధిని దిగ్బంధనం కావించేందుకు గతంలో ఇరాక్ ఎంతగానో రెచ్చగొట్టింది. అలా జరిగితే పశ్చిమ దేశాలన్నింటినీ రంగంలోకి దించాలన్నది అసలైన ఎత్తుగడ. అప్పటికీ ఇప్పటికీ మారిన పరిస్థితులు, మిత్ర దేశాలు అమెరికా కోసం చేతులు కాల్చుకొనేందుకు సిద్ధంగా లేవని ఉక్రెయిన్ నేర్పిన అనుభవం. అదే హార్మూజ్ విషయంలో పునరావృతం అవుతుందని వేసిన అంచనా. ఇలా ఎన్నో పరిణామాల పూర్వ రంగంలో ఇరాన్ ముందుకు వచ్చి జలసంధిని దిగ్బంధనం కావించింది. అది టెహరాన్ ముందు చూపుకు నిదర్శనమైతే వాస్తవాలను గ్రహించలేక అహంకారానికి లోనుకావటానికి అమెరికా తార్కాణంగా నిలిచింది. పశ్చిమాసియా సంక్షోభం ముగియటం అనివార్యం, అయితే ఎలా అన్నది ఊహించలేము !

**ఎం. కోటేశ్వరరావు**

# నయా ఉదారవాదం - మేధావి వర్గం ..

పాత సమాజాలలోని అవశేషాలను పూర్తిగా ధ్వంసం చేసి ప్రజల తరఫున నిలబడి గొంతెత్తేవారిగా వ్యవహరించకుండా, కేవలం తమ బాగోగులను చూపుకునేందుకే పరిమితమైన వ్యక్తుల గుంపులుగా అందరినీ మార్చివేయడం వాటిలో మొదటిది. తమ వృత్తిలో ఎదగడం పై మాత్రమే దృష్టి పెట్టడం, దేశంలోను విదేశాల్లో కూడా వస్తున్న అవకాశాలను వినియోగించుకుని వ్యక్తిగతంగా ఎదగాలనే తాపత్రయంతో ఉండడం మేధావి వర్గపు ప్రధాన వ్యాపకంగా మారిపోయింది. మూడవ ప్రపంచ దేశాల్లో "స్వత:సిద్ధ మేధావులు" తయారు కావాలని ఆంటోనియో గ్రామ్‌సీ అన్నాడు. ఇప్పుడు విద్య ప్రైవేటీకరించబడ్డాక ఆ లక్ష్యం పూర్తిగా లేకురా పోయింది. విద్యార్థులను మార్కెట్‌కు పనికొచ్చే 'సరుకులు' గా తయారు చేయడమే ప్రైవేటు విద్యా సంస్థల లక్ష్యం. నిస్సహాయంగా ఉన్న మైనారిటీకి వ్యతిరేకంగా నయా ఫాసిస్టులు చేపట్టిన ప్రచారం, మెజారిటీ ప్రజానీకంలో ఆ మైనారిటీలపై విద్వేష భావాన్ని కలిగించే ఆ చర్చలు, ఇంత ప్రభావాన్ని చూపగలుగుతున్నాయంటే దానికి కారణం మేధావి వర్గం గతంలో మాదిరిగా ప్రజల గౌరవాన్ని చూరగొనగలిగే పరిస్థితి లేకపోవడమే. భారతదేశం వంటి మూడవ ప్రపంచ దేశంలో నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానపు ఒక ముఖ్యమైన లక్షణం ఏమంటే అది శ్రామిక ప్రజలకు, మేధావి వర్గానికి మధ్య అగాథాన్ని ప్రవేశపెడుతుంది. వలస పాలన కారణంగా భారతీయులు అనుభవించే దుర్భర పరిస్థితులను వెలుగులోకి తీసుకు వచ్చే కర్తవ్యాన్ని అప్పటి మన దేశపు మేధావుల్లో అనేకులు చేపట్టారు. వారిలో చాలామంది వలస పాలనను ప్రతిఘటిస్తూ సాగిన ఉద్యమాల్లో పాలు పంచుకున్నారు. ఆ క్రమంలో వారు అనేక వేధింపులను, పేదరికాన్ని కూడా చవి చూడవలసి వచ్చింది. వారు నిర్వహించిన పాత్ర వలన ప్రజల అభిమానాన్ని వారు పొందగలిగారు. స్వాతంత్ర్యానంతరం, ప్రభుత్వ నియంత్రణలో దేశ ఆర్థిక వ్యవస్థ నిర్వహించబడుతున్న కాలంలో ఆ అభివృద్ధి వ్యూహం ప్రజల జీవితాల మీద కలిగించిన ప్రభావాలను వారు నిజాయితీగా, విమర్శనాత్మకంగా పరిశీలిస్తూ వచ్చారు. అందుచేత వారి పట్ల ప్రజాభిమానం కూడా కొనసాగుతూ వచ్చింది. పెట్టుబడిదారీ-పూర్వపు సమాజాల్లో కూడా మామూలు రోజుల్లో సైతం సామాన్య ప్రజలు మేధావుల పట్ల ఎప్పుడూ గౌరవాన్ని ప్రదర్శిస్తూండేవారు. దానికి తోడు మేధావివర్గం వలస పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల కాలంలో, స్వాతంత్ర్యానంతర కాలంలోని తొలి దశాబ్దాల్లో నిర్వహించిన పాత్ర ప్రజాభిమానాన్ని వారు చూరగొనేట్టు చేసింది. అయితే, నయా ఉదారవాదం ఈ పరిస్థితిని మార్చివేసింది. నయా ఉదారవాదం ఎటువంటి అవరోధాలూ లేని పెట్టుబడిదారీ వ్యవస్థను నిర్మించడానికి పూనుకుంది. ఇక్కడ దేశీయ గుత్త పెట్టుబడి అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడితో కలిసిపోయింది. పూర్తిగా సాంప్రదాయ పెట్టుబడిదారీ పద్ధతులకు అనుగుణంగా సమాజాన్ని సవరించడం దాని లక్ష్యం. అందుకే అది మేధావి వర్గపు పాత్రను పలు విధాలుగా మార్చడానికి పూనుకుంది. పాత సమాజాలలోని అవశేషాలను పూర్తిగా ధ్వంసం చేసి ప్రజల తరఫున నిలబడి గొంతెత్తేవారిగా వ్యవహరించకుండా, కేవలం తమ బాగోగులను చూపుకునేందుకే పరిమితమైన వ్యక్తుల గుంపులుగా అందరినీ మార్చివేయడం వాటిలో మొదటిది. తమ వృత్తిలో ఎదగడంపై మాత్రమే దృష్టి పెట్టడం, దేశంలోను విదేశాల్లో కూడా వస్తున్న అవకాశాలను వినియోగించుకుని వ్యక్తిగతంగా ఎదగాలనే తాపత్రయంతో ఉండడం మేధావి వర్గపు ప్రధాన వ్యాపకంగా మారిపోయింది. నయా ఉదారవాద దశకు ముందు కాలంలో మేధావి వర్గం సామ్రాజ్యవాద వ్యతిరేక దృక్పథం మీద ఆధారపడి తన సైద్ధాంతిక దృష్టికోణాన్ని రూపొందించుకుంది. మేధావి వర్గంలో ఈ సైద్ధాంతిక వైఖరుల విషయంలో చాలా ప్రధానమైన తేడాలు ఉన్నమాట వాస్తవం. కాని వారిలో చాలామంది సామ్రాజ్యవాదం యొక్క వాస్తవ పాత్ర పట్ల స్పృహతో వ్యవహరించేవారు.



# జీవితాల్లో మార్పు తెచ్చేది చదువొక్కటే..

(మొదటి పేజీ తరువాయి)
వల్లే తెలంగాణకు చట్టబద్ధత వచ్చిందని గుర్తుచేశారు. వారి త్యాగాలకు ప్రతిరూపంగా రాష్ట్రంలో విద్యా వ్యవస్థను పటిష్టం చేయడమే తన ఆకాంక్ష అన్నారు.

**ప్రైవేట్ బడులకు ధీటుగా ప్రభుత్వ బడులు**

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే టీచర్లకు పూర్తి స్థాయి అర్హతలు, అనుభవం ఉన్నాయని.. అదే ప్రైవేట్ స్కూళ్లలో ఉపాధ్యాయులకు సగం అర్హతలు కూడా ఉండవని సీఎం పేర్కొన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి వల్లే విద్యార్థులు ప్రైవేట్ బడుల వైపు వెళ్లాల్సి వచ్చిందని దుయ్యబట్టారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ బడులను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దుతామని, మార్పు అనేది రాత్రికి రాత్రి రాకపోయినా ఒక మంచి అడుగైతే ముందుకు పడాల్సిందేనని ఆశాభావం వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి రాగానే ముందుగా పెండింగ్‌లో ఉన్న టీచర్ల సమస్యలన్నింటినీ పరిష్కరించామని రేవంత్ రెడ్డి తెలిపారు.

విద్యార్థుల భవిష్యత్తు కోసం రాష్ట్రంలోని లక్షకు పైగా ఉపాధ్యాయులు నిరంతరం శ్రమిస్తున్నారని.. ప్రభుత్వం కూడా విద్యపై ఏడాదికి రూ.30 కోట్లు ఖర్చు చేస్తోందని వివరించారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల గతంలో దేశంలో తెలంగాణ పాఠశాలలు 35వ స్థానంలో ఉండేవని, తమ ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల ఇప్పుడు ఆ స్థానాన్ని 18వ ర్యాంకుకు తీసుకురాగలిగామని సీఎం వెల్లడించారు. ప్రస్తుతం దేశంలో వైట్ కాలర్ ఉద్యోగాలు తగ్గిపోతున్నాయని.. అందుకే తమ ప్రభుత్వం సాంకేతిక నైపుణ్యాలతో కూడిన బ్లూ కాలర్ ఉద్యోగాలపై ప్రత్యేకంగా దృష్టి సారించిందని సీఎం పేర్కొన్నారు. ఇందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఐటీఐ కేంద్రాలను త్వరలోనే అత్యాధునికంగా తీర్చిదిద్దనున్నట్లుగా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.

# 2027లో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేస్తా..

## ఢిల్లీ చిట్‌చాట్‌లో కేటీఆర్ కీలక వ్యాఖ్యలు



నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్:
తెలంగాణలో రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, కేసీఆరే మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం దేశ రాజధాని ఢిల్లీలో ఆయన మీడియాతో ఆసక్తికరంగా చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ పరిపాలన, తన భవిష్యత్తు కార్యాచరణపై కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

**మూడు సర్వేల్లో బీఆర్ఎస్‌దే విజయం**

రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి పోయిందని కేటీఆర్ కామెంట్ చేశారు. తెలంగాణలో మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి రాదన్న పచ్చి నిజం స్వయంగా సీఎం రేవంత్ రెడ్డికి కూడా తెలుసని అన్నారు. ఇటీవల 3 ప్రైవేటు ఏజెన్సీలు నిర్వహించిన క్షేత్రస్థాయి సర్వేలలోనూ రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీనే తిరిగి అధికారంలోకి రాబోతోందని స్పష్టమైన నివేదికలు వచ్చాయని ఆయన వెల్లడించారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'గుర్రం విలువ ఏంటనేది గాడిదను చూసిన తర్వాతే తెలుస్తుంది. అలాగే చీకటి ఉన్నప్పుడే వెలుగు విలువ ఏంటో అర్థమవుతుంది'అంటూ గత కేసీఆర్ ప్రభుత్వానికి, ప్రస్తుత రేవంత్ ప్రభుత్వానికి ఉన్న తేడాను ప్రజలు గుర్తిస్తున్నారని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పాలన పేరిట తెలంగాణ ప్రజలను హింసిస్తున్నారని ఆరోపించారు. ఇదే సమయంలో తెలంగాణలో బీజేపీకి అధికారంలోకి వచ్చే అవకాశమే లేదని కేటీఆర్ స్పష్టం చేశారు.

**కేసీఆర్ ఎంట్రీపై క్లారిటీ**

తన భవిష్యత్తు రాజకీయ ప్రణాళికను వెల్లడిస్తూ.. 2027లో రాష్ట్రవ్యాప్తంగా తాను పాదయాత్ర చేస్తానని కేటీఆర్ ప్రకటించారు. ప్రజల్లోకి వెళ్లడం ద్వారా కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడతామన్నారు. ఇక కేసీఆర్ ప్రజల్లోకి ఎప్పుడు వస్తారనే అంశంపై స్పందిస్తూ.. రావాలనుకున్నప్పుడు కేసీఆర్ కచ్చితంగా ప్రజల మధ్యకు వస్తారని స్పష్టం చేశారు. ఆయనకు ఎలాంటి అభద్రతాభావం లేదని, సరైన సమయంలో ఆయన రంగంలోకి దిగుతారని కేటీఆర్ స్పష్టం చేశారు.

# జర్నలిస్టుల సమస్యలు తక్షణం పరిష్కరించాలి..

## ఐఅండ్‌పీఆర్ కార్యాలయం ఎదుట టీడబ్ల్యూజేఎఫ్ భారీ నిరసన

నిర్భయవార్త ప్రతినిధి :హైదరాబాద్:
జర్నలిస్టుల సమస్యల సాధన కోసం కలం కదం తొక్కింది. తమ దీర్ఘకాలిక సమస్యలను, న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని సమాచార, పౌరసంబంధాల శాఖ రాష్ట్ర ప్రధాన కార్యాలయం ఎదుట జర్నలిస్టులు భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ ఆందోళన కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ యాక్టింగ్ ప్రెసిడెంట్ పి.రాంచందర్, ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య పాల్గొని ప్రసంగించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం తమ యూనియన్ ఆధ్వర్యంలో ఇప్పటికే పలుమార్లు దశలవారీగా ఆందోళనలు చేపట్టామని వారు గుర్తుచేశారు. ఇన్ని పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వం నుంచి గానీ, అధికారుల నుంచి గానీ కనీస స్పందన రాకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగానే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులను సమీకరించి, పెద్ద ఎత్తున ఈ ఆందోళనకు దిగినట్లు వారు స్పష్టం చేశారు. జర్నలిస్టుల పట్ల ప్రభుత్వం ఇకనైనా సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

**టీడబ్ల్యూజేఎఫ్ ప్రధాన డిమాండ్లు ఇవే..**

ఎలాంటి కోటాలతో సంబంధం లేకుండా, అర్హులైన జర్నలిస్టులందరికీ



వెంటనే అక్రిడిటేషన్లు మంజూరు చేయాలి. జర్నలిస్టులకు ఇళ్లు లేదా ఇళ్ల స్థలాలు కేటాయించాలి. ఇందుకు సంబంధించిన ప్రభుత్వ ప్రక్రియను వెంటనే వేగవంతం చేయాలి. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే జర్నలిస్టులకు కూడా కార్పొరేట్ వైద్యం అందేలా హెల్త్ కార్డులు మంజూరు చేయాలి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ బస్సులతో పాటు, హైదరాబాద్ మెట్రో రైళ్లలోనూ జర్నలిస్టులకు పూర్తిగా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలి.

# క్యాంపస్‌లో డ్రగ్స్ కనిపిస్తే కాలేజీ గుర్తింపు రద్దు

## డీజీపీ సీవీ ఆనంద్ మాస్ వార్నింగ్



నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్:
రాష్ట్రంలోని స్కూళ్లు, కాలేజీల్లో డ్రగ్స్ మాటే వినపడకుండా చేసేందుకు తెలంగాణ పోలీసు శాఖ కఠిన చర్యలకు శ్రీకారం చుట్టబోతోంది. ఇకపై 'జీరో టాలరెన్స్' విధానాన్ని పక్కాగా అమలు చేయనున్నట్లుగా డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. ఒకవేళ ఏ విద్యాసంస్థలోనైనా డ్రగ్స్ విక్రయాలు, వినియోగం జరిగినట్లుగా తేలితే, సదరు సంస్థల గుర్తింపును రద్దు చేసేందుకు కూడా వెనుకాడబోమని ఆయన హెచ్చరించారు. బుధవారం డీజీపీ సీవీ ఆనంద్ ఈగల్ విభాగానికి చెందిన ఉన్నతాధికారులతో డీజీపీ కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

**ప్రతి క్యాంపస్‌లో ప్రత్యేక నిఘా కమిటీలు..**

అయితే, ఈ ఉన్నత స్థాయి సమావేశంలో డీజీపీ సీవీ ఆనంద్ పలు కీలక నిర్ణయాలను వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, కళాశాలల్లో తప్పనిసరిగా డ్రగ్స్ నిరోధక కమిటీలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల రక్షణను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రతి విద్యాసంస్థలో ఓ స్పెషల్ కో-ఆర్డినేటర్‌ను నియమించడం తప్పనిసరి అని తెలిపారు. విద్యార్థులు కాలేజీల్లో చేరే సమయంలోనే డ్రగ్స్ వల్ల జరిగే నష్టాలపై అవగాహన కల్పించాలని.. ఇందుకోసం సైకాలజిస్టులు, నిపుణుల సేవలను వినయోగించుకోవాలని సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

**ఉమ్మడి కార్యాచరణకు ఆదేశం..**

ఈగల్ అధికారులు రూపొందించిన ముసాయిదా ప్రజెంటేషన్‌ను పరిశీలించిన డీజీపీ సీవీ ఆనంద్ విధివిధానాల్లో కొన్ని మార్పులను సూచించారు. పోలీస్, విద్యా, ఆరోగ్య శాఖలతో పాటు స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేస్తూ సమగ్రమైన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ తయారు చేయాలని ఆదేశించారు. త్వరలోనే దీనిపై మరో సమావేశం నిర్వహించి తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నారు. భవిష్యత్తు పౌరులను తీర్చిదిద్దే విద్యా సంస్థల్లో డ్రగ్స్‌కు ఏమాత్రం చోటు లేదని, ప్రతి విద్యార్థికి సురక్షితమైన, డ్రగ్స్ రహిత వాతావరణాన్ని అందించడమే మా ప్రాధాన్యత అని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో 'ఈగల్' డైరెక్టర్ సందీప్ శాండిల్య, ఐజీ పద్మజా రెడ్డి, ఎస్పీ గిరిధర్ సహా పలువురు సీనియర్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# ఫార్చ్యూన్ కంపెనీలకు హబ్‌గా హైదరాబాద్: సీఎం రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)
నగరంలో ఉన్న పరిశ్రమలను బయటకు తరలిస్తామన్నారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ చేపట్టామని, డీజిల్ నుంచి ఈవీలుగా బస్సులను మారుస్తామని వెల్లడించారు. ఈవీ వాహనాల రిజిస్ట్రేషన్‌లో జీరో ట్యాక్స్ అమలు చేస్తున్నామని అన్నారు. ఫార్చ్యూన్ కంపెనీలకు హబ్‌గా హైదరాబాద్ మారనుందని, ప్రపంచంలోనే అత్యంత అధునాతనమైన నగరాన్ని నిర్మిస్తున్నామని వెల్లడించారు.పరిశ్రమలకు సింగిల్ విండో ద్వారా అనుమతులు ఇస్తున్నామని, పారిశ్రామికవేత్తలకు అనేక రకాల ప్రోత్సాహకాలు అందిస్తున్నామని సీఎం చెప్పుకొచ్చారు. ప్రతి రంగానికి ప్రత్యేక పాలసీలు రూపొందించామని తెలిపారు. పాలసీలపై ఎప్పటికప్పుడు రివ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. ఫ్యూచర్ సిటీకి అమెజాన్ డేటా సెంటర్ స్టెప్పింగ్ స్టోన్‌గా ఉంటుందన్నారు. ఫ్యూచర్ సిటీకి రాబోయే రోజుల్లో మరిన్ని పెట్టుబడులు రానున్నాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కాగా, ఫ్యూచర్ సిటీలో 202 ఎకరాల్లో అమెజాన్ డేటా సెంటర్ నిర్మాణం జరగనుంది. 12 ఏళ్లలో రూ.60వేల కోట్లను అమెజాన్ వెచ్చించనుంది. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణా రావు, వాకిటి శ్రీహరి, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారు రామకృష్ణా రావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 'తెలంగాణ రక్షణ సేన' దూకుడు..

(మొదటి పేజీ తరువాయి)
నియోజకవర్గ ఇంచార్జ్‌లను కవిత ప్రకటించారు. తొలి విడతగా 23 స్థానాలకు ఇంచార్జ్‌లను ప్రకటించగా.. రాబోయే రోజుల్లో మిగిలిన నియోజకవర్గాలపై దృష్టి పెట్టనున్నారు. రాష్ట్రంలోని మిగతా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు కూడా ఇదే తరహాలో దశల వారీగా ఇంచార్జ్‌ల పేర్లను అధికారికంగా ప్రకటించనున్నట్లుగా పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు.

# తెలంగాణలో ఎస్ఐఆర్ గడువు పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి)
ప్రక్రియను ఆగస్టు 10 నుంచి అక్టోబర్ 8 వరకు అధికారులు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆ ప్రాసెస్ అంతా ముగిసిన తర్వాత తుది ఓటర్ల జాబితాను అక్టోబర్ 12న అధికారికంగా ప్రకటించనున్నారు.

**రాజకీయ పార్టీల అభ్యర్థనలు..**

కాగా, తెలంగాణ వ్యాప్తంగా ఓటరు సవరణ ప్రక్రియ నత్తనడకన కొనసాగుతోందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డిని మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రతినిధి బృందం కోరింది. మరోవైపు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ కూడా ప్రజలకు కొన్ని ప్రాంతాల్లో ఇంకా ఎన్యుమరేషన్ ఫారాలు కూడా అందలేదంటూ రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లగా వారు కేంద్ర ఎన్నికల సంఘానికి అభ్యర్థనలు పంపారు. ఈ క్రమంలోనే షెడ్యూల్ ప్రకారం తెలంగాణలో ఎస్ఐఆర్ గడువు జూలై 24 వరకు ఉండగా.. తాజాగా రాజకీయ పార్టీల అభ్యర్థన మేరకు గడువును ఆగస్టు 3 వరకు పొడిగిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది.

# ఈనెలలోనే 50 నామినేటెడ్ పోస్టుల భర్తీ..


(మొదటి పేజీ తరువాయి)
దుష్ప్రచారం చేశారు' అని తెలిపారు. కూనంనేని మిత్రపక్షం అయినప్పటికీ అక్కడ కాంగ్రెస్ క్యాడర్ కూడా ఉందన్నారు. దానిని కాపాడుకునే ప్రయత్నంలో ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడి ఉంటారని చెప్పుకొచ్చారు. కూనంనేనితో తమకెలాంటి విభేదాలూ లేవన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకోవాలని చెప్పారు. ప్రతి చిన్న విషయానికీ గాంధీభవన్ రావటం మానుకోవాలని క్యాడర్‌కు సూచించారు. నలుగురు ఐదుగురు మినహా అందరు డీసీసీ అధ్యక్షుల పనితీరు బాగుందని మహేశ్ గౌడ్ కితాబిచ్చారు.

# జవహర్‌నగర్ డంప్‌యార్డ్ తరలింపు వరకు పోరాటం ఆగదు

(మొదటి పేజీ తరువాయి)
పార్లమెంట్‌లోనూ ఈ అంశాన్ని లేవనెత్తుతానని, జవహర్‌నగర్ డంప్‌యార్డ్‌ను అక్కడి నుంచి తొలగించే వరకు ప్రజలతో కలిసి ఉద్యమిస్తానని భరోసా ఇచ్చారు.ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మల్కాజిగిరి ఎంపీగా ఉన్న సమయంలో డంప్‌యార్డ్ తొలగిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని ఈటల డిమాండ్ చేశారు.

# నిమిషాల్లో ఇంటికి గ్యాస్ సిలిండర్..

## హెచ్‌పీసీఎల్‌తో స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ జోడీ!




బిజినెస్:
నిత్యావసర సరుకుల డెలివరీలో దూసుకుపోతున్న ప్రముఖ క్విక్ కామర్స్ సంస్థ 'స్విగ్గీ ఇన్‌స్టామార్ట్' కస్టమర్ల కోసం మరో వినూత్న సేవను అందుబాటులోకి తెచ్చింది. ఇకపై యాప్‌లో ఆర్డర్ చేసిన నిమిషాల్లోనే వంటగ్యాస్ సిలిండర్‌ను డెలివరీ చేసేందుకు హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌తో కీలక ఒప్పందం కుదుర్చుకుంది. దేశంలో ఓ క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఇలా గ్యాస్ సిలిండర్ డెలివరీ చేయడం ఇదే తొలిసారి.

**ఎలాంటి సిలిండర్లు దొరుకుతాయి?**

జాతీయ మీడియా సమాచారం ప్రకారం.. ఈ ఆన్ డిమాండ్ సిలిండర్ డెలివరీ సేవలను ప్రాథమిక దశలో బెంగళూరులో ప్రారంభించారు. స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ ద్వారా హెచ్‌పీసీఎల్ కొత్తగా ప్రవేశపెట్టిన 10 కిలోల 'హెచ్‌పీ నవ్య' కాంపోజిట్ సిలిండర్‌ను, 5 కిలోల సాధారణ సిలిండర్‌ను కస్టమర్లు ఆర్డర్ చేసుకోవచ్చు. నవ్య సిలిండర్ పారదర్శకంగా ఉండటం వల్ల లోపల గ్యాస్ ఎంతుందో సులభంగా చూసుకోవచ్చు.

**కనెక్షన్ అవసరం లేదు..**

ఈ సేవల ద్వారా సిలిండర్ పొందడానికి ముందుగా మీకు ఎలాంటి గ్యాస్ కనెక్షన్ ఉండాల్సిన పని లేదు. వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చి అద్దెకుండే విద్యార్థులు, ఉద్యోగులు, చిన్న కుటుంబాలకు ఇది ఎంతో అనుకూలంగా ఉంటుంది.

**ఆర్డర్ మరియు డెలివరీ విధానం**

మొదటిసారి తీసుకునే వారికి దీన్ని కొత్త సిలిండర్ కొనుగోలుగా పరిగణిస్తారు. భద్రతా కారణాల దృష్ట్యా, కస్టమర్లు యాప్‌లో తమ గుర్తింపు కార్డు వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంటుంది. తదుపరి రీఫిల్ ఆర్డర్ల సమయంలో డెలివరీ బాయ్‌కి ఖాళీ సిలిండర్‌ను అప్పగించి (రాఖుజూ విధానం) గ్యాస్ నింపిన కొత్త సిలిండర్‌ను తీసుకోవచ్చు. గ్యాస్ సిలిండర్ల రవాణాలో ప్రమాదాలు జరగకుండా కఠిన నిబంధనలు పాటిస్తున్నారు. స్విగ్గీ యాప్‌లో ఆర్డర్ రాగానే, అది నేరుగా స్థానిక హెచ్‌పీసీఎల్ ఏజెన్సీకి వెళుతుంది. వారి అధీకృత డిస్ట్రిబ్యూటర్ల నెట్‌వర్క్ ద్వారా, శిక్షణ పొందిన సిబ్బందితో మాత్రమే డెలివరీని పూర్తి చేస్తారు. కస్టమర్లకు కిరాణా సరుకులే కాకుండా, అత్యవసరమైన గృహ సేవలను కూడా సురక్షితంగా, నమ్మకంగా నిమిషాల్లోనే అందిస్తున్నామని స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ సీఈఓ అమితేష్ ఝా ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# పారదర్శక ఓటర్ జాబితా కోసం వివిధ రాజకీయ ప్రతినిధులు సహకారం అందించండి.

### భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట

భద్రాచలం జూలై 15 నిర్భయ వార్త ప్రతినిధి. పారదర్శక ఓటరు జాబితా కోసం ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియను పక్కాగా నిర్వహించడానికి వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు సంబంధిత బిఎల్ఓ మరియు సూపర్వైజర్లకు సహకరించి సర్ ప్రక్రియ ఓటర్ల జాబితా సవరణ సక్రమంగా జరిగేలా చూడాలని భద్రాచలం నియోజకవర్గం ఈఆర్ఓ సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట సంబంధిత వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్ లో భద్రాచలం నియోజకవర్గం లోని వివిధ పార్టీల ప్రతినిధులతో సర్– ప్రక్రియ షెడ్యూల్ సమగ్ర ఓటర్ల జాబితా తయారీ నిర్వహణలో అనుసరించవలసిన



అంశాలపై ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ మాసం 25 నుంచి ఎస్.ఐ.ఆర్ ఇంటింటి సర్వే ప్రక్రియ ప్రారంభమైందని భద్రాచలం నియోజకవర్గం లోని వివిధ మండలాలలో బూత్ లెవెల్ ఆఫీసర్లు, సూపర్వైజర్లు ఎస్.ఐ.ఆర్ సర్వే ప్రారంభించి ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ చేసి కుటుంబ సభ్యుల వివరాలు ఓటర్ జాబితాలో నమోదు చేస్తున్నారని, ఈ ప్రక్రియకు పోలింగ్ స్టేషన్ పరిధిలోని ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా బిఎల్ఓ లకు సహకారం అందించాలని అన్నారు. బిఎల్వోలు వారి పరిధిలోని పోలింగ్ స్టేషన్లలో ఓటర్ల నమోదు చేసే సమయంలో సంబంధిత ప్రజా ప్రతినిధులు ఓటర్లకు అవగాహన కల్పించి తప్పనిసరిగా ఎన్యుమరేషన్ ఫారంలో పేర్లు నమోదు చేసుకునేలా చూడాలని, ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ఒక ఓటరు కూడా తప్పిపోకుండా చూడాలని, ఓటరు జాబితాలో పేర్లు ఉన్నవారు, ఇతర ప్రాంతానికి శాశ్వతంగా వలస వెళ్లారా మృతి చెందారా, రెండు చోట్ల పేర్లు ఉన్నాయా అనే అంశాలను నిశితంగా గమనించాలని అన్నారు. అలాగే మాజీ ప్రజా ప్రతినిధులు ఇతర విఐపి మ్యాపింగ్ పై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీని ఇతరులకు తెలుపకూడదని ఇలా చేయడం నేరంగా పరిగణించపడుతుందని అన్నారు ఇంటింటి గణన జూన్ 25 నుండి ఈనెల 24వ తేదీ వరకు, ముసాయిదా డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ప్రచురణ 31 జులై వరకు, క్లైమ్ లు మరియు అభ్యంతరాల దాఖలు కాలం 31 జులై నుండి 30 ఆగస్టు వరకు, నోటీసు దశ, జారీ విచారణ మరియు ధ్రువీకరణ 31 జులై నుండి 28 సెప్టెంబర్ వరకు, తుది ఓటర్ల జాబితా ప్రచురణ 01 అక్టోబర్ 26 వరకు సర్ 2026 ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో భద్రాచలం తాసిల్దార్ రవికుమార్, ఎలక్షన్ డిటి గోపాలకృష్ణ మరియు వివిధ పార్టీల ప్రతినిధులు, కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కొండరెడ్ల గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలి: ఐటీడీఏ పీఓకు వినతిపత్రం

అశ్వారావుపేట, జూలై 16 (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి )సామాజికంగా, విద్యా పరంగా మరియు ఆర్థికంగా వెనుకబడి, అనేక ఏళ్లుగా కనీస వసతులకు దూరంగా జీవిస్తున్న ఆదివాసి కొండరెడ్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి (పీఓ) గారికి వినతిపత్రం సమర్పించారు. ఆదివాసి కొండరెడ్ల సంఘం వ్యవస్థాపక గౌరవ అధ్యక్షులు ముర్ల రమేష్ ఆధ్వర్యంలో




అశ్వారావుపేట మండలం, గాండ్లగూడెం గ్రామానికి చెందిన కొండరెడ్ల గిరిజనులు ఈ వినతిపత్రం అందజేశారు. గిరిజనుల సమస్యలపై ఐటీడీఏ పీఓ సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా కొండరెడ్ల సంఘం నాయకులు మరియు గ్రామస్థులు మాట్లాడుతూ.. దశాబ్దాలుగా తాము కనీస మౌలిక వసతులు లేక నరకయాతన అనుభవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించి తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్లు, నిలువ నీడ లేని కొండరెడ్ల కుటుంబాలన్నింటికీ తక్షణమే ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలి. విద్యుద్దీకరణ ఒ పెన్షన్లు, గ్రామాల్లో ప్రతి ఇంటికీ కరెంట్ సౌకర్యం కల్పించడంతో పాటు, వీధి దీపాలు (లైట్లు) ఏర్పాటు చేయాలి. అలాగే అర్హులైన వృద్ధులు, ఒంటరి మహిళలకు తక్షణమే పెన్షన్లు మంజూరు చేయాలి. రక్షిత తాగునీరు, వ్యవసాయానికి సాగునీరు మరియు గ్రామాలకు పక్కా రహదారుల (రోడ్ల) సౌకర్యం కల్పించాలి. అధికారులు స్పందించి న్యాయం చేయాలి: ముర్ల రమేష్సమాజంలో




అన్ని రంగాల్లో వెనుకబడిన కొండరెడ్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి. ఇందిరమ్మ ఇళ్లు, కరెంట్, రోడ్లు, పెన్షన్లు వంటి కనీస అవసరాల కోసం ఇంకా పోరాటాలు చేయాల్సి రావడం బాధాకరం. అధికారులు సానుకూలంగా స్పందించారు, క్షేత్రస్థాయిలో పనులు త్వరగా ప్రారంభం కావాలి. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు, గ్రామ పెద్దలు ఉప్పిశెట్టి రవీందర్ రెడ్డి, బొల్లి దాసిరెడ్డి, ఉప్పిశెట్టి మాంగారెడ్డి, గురుగుంట్ల నాగమణి, ఉప్పిశెట్టి దుర్గమ్మ, ఉప్పిశెట్టి కన్నపురెడ్డి, పూజారి చిన్నపరెడ్డి, చుక్కమ్మ, జ్యోతి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై అశ్వారావుపేట పోలీసులు ఉక్కుపాదం!

### ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో ప్రత్యేక నిఘా -- చట్టాన్ని ఉల్లంఘిస్తే వాహనాలు సీజ్, కఠిన కేసులు తప్పవు: ఎస్. ఐ

అశ్వారావుపేట, జూలై 16 ( నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి)ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి తెలంగాణ రాష్ట్రంలోని అశ్వారావుపేట ప్రాంతానికి ఎలాంటి అనుమతులు లేకుండా చట్టవిరుద్ధంగా జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసు శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్హెచ్ఓ) ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చట్టాల కింద కేసులు,ప్రభుత్వ అనుమతులు, చెల్లుబాటు అయ్యే రవాణా పత్రాలు లేకుండా లారీలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాల ద్వారా ఇసుకను తరలించడం పూర్తిగా




చట్టవిరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. ఇటువంటి అక్రమ రవాణాకు పాల్పడే వాహనాలను వెంటనే స్వాధీనం (సీజ్) చేసుకుంటామని హెచ్చరించారు. అంతేకాకుండా, సంబంధిత వ్యక్తులపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), గనులు మరియు ఖనిజాల అభివృద్ధి మరియు నియంత్రణ చట్టం (ఎంఎండీఆర్ యాక్ట్)తో పాటు ఇతర వర్తించే కఠిన చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సహకరించే వారిపై కూడా చర్యలు,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి తెలంగాణలోకి అక్రమంగా ఇసుక రవాణా చేసే వ్యక్తులు, వాహన యజమానులు, డ్రైవర్లు, నిర్వాహకులతో పాటు, ఈ అక్రమ కార్యకలాపాలకు వెనుక ఉండి సహకరించే వారిపై కూడా సమానంగా చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని ఎస్.హెచ్.ఓ స్పష్టం చేశారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండబోదని తేల్చి చెప్పారు. నిరంతర నిఘా – ప్రజల వివరాలు గోప్యం,అశ్వారావుపేట ప్రాంతంలో అక్రమ ఇసుక రవాణాను పూర్తిగా అరికట్టేందుకు పోలీసులు నిరంతరం వాహన తనిఖీలు, ప్రత్యేక నిఘా మరియు ఆకస్మిక దాడులు నిర్వహిస్తారని తెలిపారు. ప్రజలు ఎవరైనా తమ పరిధిలో అక్రమ ఇసుక రవాణాను గమనించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-- 100/112 ద్వారా సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని, ప్రజలు భయపడకుండా పోలీసులకు సహకరించాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్ విజ్ఞప్తి చేశారు.

# నిరుద్యోగ గిరిజన యువతి యువకులు వృత్తి నైపుణ్య శిక్షణలు తీసుకొని జీవనోపాధి పెంపొందించుకోవాలి.

## ఐటీడీఏ పీవో బి.రాహుల్...








భద్రాచలం జూలై 15 నిర్భయ వార్త ప్రతినిధి. నిరుద్యోగులైన గిరిజన యువతీ యువకులు పై స్థాయి వరకు చదువుకొని ఇంటిపట్టునే ఉండి ఖాళీగా ఉండకుండా అంది వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకొని జీవనోపాధికి వెసులుబాటు కల్పించుకోవాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. బుధవారం నాడు ఐటిడిఏ ప్రాంగణంలోని గిరిజన భవనంలో "వరల్డ్ స్కిల్ డే" సందర్భంగా నిరుద్యోగ గిరిజన యువతీ యువకులకు వివిధ స్వయం ఉపాధి పథకాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాలలో మహిళలు పురుషులతో సమానంగా దూసుకుపోతున్నారని, మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి యువతి, యువకులు చెడు భావాలను మనసులో నుండి తీసేసి మార్పు చెంది వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవాలని, నైపుణ్యాలు నేర్చుకుంటే ఏ సంస్థలోనైనా కష్టపడి పనిచేసి కుటుంబాన్ని పోషించుకోవచ్చని అన్నారు. కష్టపడి పని చేస్తే తప్పనిసరిగా ప్రతి మనిషికి విలువ పెరుగుతుందని,వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకొని ముందుకు పోతున్న దేశాలలో చైనా జపాన్ దక్షిణ కొరియా రాష్ట్రాలు ముందుకు పోతున్నాయని, ప్రపంచ దేశాలకు పోటీపడి మనం కూడా ముందుకు పోవాలని, పీజీ, బీటెక్, చేసిన యువతీ, యువకులు స్కిల్ డెవలప్మెంట్ పెంపొందించుకొని వివిధ ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో పనిచేస్తూ జీవనోపాధి కల్పించుకుంటున్నారని, మన రాష్ట్రంలో ఉన్న యువతీ, యువకుల కొరకు స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగం అనేది ఈ పోటీ ప్రపంచంలో సాధించాలంటే ఎంతో శ్రమించాలని, ప్రభుత్వ ఉద్యోగం నోటిఫికేషన్లు వచ్చేవరకు ప్రతి ఒక్కరు ఐటీడీఏ భవిత సెల్లు ద్వారా నిర్వహించే వివిధ రకాల వృత్తి శిక్షణలో తర్ఫీదు పొంది శిక్షణ తీసుకొని స్వయం ఉపాధి ద్వారా జీవనోపాధి పొంది ఆర్థిక వెసులు బాటు కల్పించుకొని ఉపాధి అవకాశాలు పెంపొందించుకోవాలని ఆయన అన్నారు. రాష్ట్రంలో ఉన్న నాలుగు ఐటీడీఏలకు రాష్ట్ర ప్రభుత్వం గిరిజన యువతి యువకులకు వివిధ రకాల శిక్షణలు అందించి ఉపాధి అవకాశాలు కల్పించడానికి ప్రతి ఐటీడీఏకు 2500 మంది నిరుద్యోగ యువతీ యువకులకు వివిధ రకాల శిక్షణలు అందించాలని ఆదేశాలు జారీ చేసినందున గిరిజన యువతి యువకులకు వారికి ఇష్టమైన కోర్సులలో శిక్షణ తీసుకోవడానికి అశ్వరావుపేట, ఇల్లందు, ఖమ్మం, భద్రాచలం వైటీసీలలో ప్రస్తుతం 570 మందికి వివిధ రకాల శిక్షణలు అందిస్తున్నామని అన్నారు. యువతీ యువకులు మీరు శిక్షణ తీసుకోవడమే కాక మీ గ్రామంలోని తోటి నిరుద్యోగ గిరిజన యువతి యువకులకు అవగాహన కల్పించి శిక్షణలు తీసుకునేలా ప్రోత్సహించాలని శిక్షణ సమయంలో పూర్తి ఉచిత భోజన వసతి సౌకర్యాలతో పాటు శిక్షణకు సంబంధించిన మెటీరియల్ యూనిఫార్మ్ అందిస్తున్నామని అన్నారు. అలాగే శిక్షణ పూర్తయిన యువతీ యువకులకు ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అన్నారు. ఎంబ్రాయిడరింగ్ మరియు టైలరింగ్ శిక్షణ తీసుకున్న 30 మంది యువతులకు సర్టిఫికెట్లు మరియు తమిళనాడులో ఐటీ లో జాబ్ చేయడానికి ముందుకు వచ్చిన యువకులకు జాబ్ ఆర్డర్స్ మరియు యూనిఫార్మ్ శిక్షణ మెటీరియల్స్ అందించారు ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, పిఈటిసి ప్రిన్సిపాల్ డాక్టర్ వీరు నాయక్, జేడీఎం హరికృష్ణ, వై టి సి ఇంచార్జ్ శ్రీనివాస్, ఇన్స్ట్రక్టర్లు జ్యోతి, ఎండి అఫ్రిన్, రజియా బేగం, బాధావత్ సంధ్య భవిత సెల్ సిబ్బంది సమ్మయ్య, కౌన్సిలింగ్కు వచ్చిన గిరిజన యువతి యువకులు పాల్గొన్నారు.

# అంకమ్మ చెరువు సాక్షిగా.. ఏజెన్సీ చట్టాలకు 'ఖూనీ'!

### అనుమతులు లేని చేపల చెరువులతో 'ఆంధ్రా బాబుల' అక్రమ సామ్రాజ్యం.. మామూళ్ల మత్తులో యంత్రాంగం!





అశ్వారావుపేట, జూలై 16 (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి)అశ్వారావుపేట పరిధిలోని అంకమ్మ చెరువు సమీప ఏజెన్సీ ప్రాంతంలో చట్టం చుట్టంగా మారింది. ఐదో షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనులకు రక్షణగా ఉన్న చట్టాలను తుంగలో తొక్కుతూ, ప్రైవేటు వ్యక్తులు అక్రమ సామ్రాజ్యాన్ని విస్తరిస్తున్నారు. 99 సంవత్సరాల లీజు అనే నకిలీ ఒప్పందాల పేరుతో అమాయక గిరిజనుల అసైన్మెంట్ భూములను చేజిక్కించుకుంటూ, అక్కడ భారీ ఎత్తున నిబంధనలకు విరుద్ధంగా చేపల చెరువుల నిర్మాణాలుచేపడుతున్నారు. పొరుగు రాష్ట్రమైన ఆంధ్ర ప్రాంతానికి చెందిన కొందరు వ్యాపారవేత్తలు ఇక్కడి స్థానిక అధికార యంత్రాంగాన్ని మచ్చిక చేసుకుని ఈ దోపిడీకి తెరలేపడంపై స్థానిక గిరిజన సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. సబ్సిడీ విద్యుత్ సైతం కొల్లగొడుతూ,ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే ఈ ఏజెన్సీ ప్రాంతంలో భారీ ఎత్తున చేపల చెరువుల తవ్వకాలు జరిగిపోతున్నాయి. చట్టవిరుద్ధంగా సాగుతున్న ఈ వ్యాపారానికి ప్రభుత్వం గిరిజనుల కోసం, పేద రైతుల కోసం ఇస్తున్న సబ్సిడీ విద్యుత్‌ను కూడా దొడ్డిదారిన వాడుకుంటూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. కంటి ముందే ఇంత పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా, క్షేత్రస్థాయి అధికారుల నుంచి పైస్థాయి(అధికారుల) వరకు అందరూ 'మామూళ్ల' మత్తులో జోగుతూ నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏజెన్సీ చట్టాలు ఏం చెబుతున్నాయి చారిత్రాత్మక తీర్పులు ఇవే!రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ ప్రకారం ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరులు భూములు కొనడం లేదా లీజుకు తీసుకోవడం చట్టరిత్యా నేరం. గతంలో సుప్రీంకోర్టు మరియు హైకోర్టులు ఇచ్చిన తీర్పులను ఈ వ్యాపారులు బాహాటంగానే ఉల్లంఘిస్తున్నారు. సమత వర్సెస్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం (1997) చారిత్రాత్మక తీర్పు,సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ ల్యాండ్‌మార్క్ తీర్పు ప్రకారం, ఏజెన్సీ (షెడ్యూల్డ్) ప్రాంతాల్లోని ప్రభుత్వ లేదా ప్రైవేట్ భూములను గిరిజనేతరులకు గానీ, ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలకు గానీ లీజుకు ఇవ్వడం పూర్తిగా నిషిద్ధం. భూమి బదలాయింపు నియంత్రణ చట్టం (1/70) ప్రకారం గిరిజన భూమి కేవలం గిరిజనుల లేదా ప్రభుత్వానికి మాత్రమే బదిలీ కావాలి. 99 ఏళ్ల లీజుల పేరిట ఇక్కడ జరుగుతున్న భూ ఆక్రమణలు నేరుగా 'సమత' తీర్పును ధిక్కరించడమే. రామిరెడ్డి వర్సెస్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీర్పు,ఏజెన్సీ ప్రాంతాలలో గిరిజనుల ఆర్థిక, సామాజిక భద్రతను కాపాడటానికి గిరిజనేతరులకు భూముల బదిలీని నిషేధించే చట్టాలు ముమ్మాటికీ రాజ్యాంగబద్ధమైనవేనని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ తీర్పుల ప్రకారం అంకమ్మ చెరువు సమీపంలో జరుగుతున్న లీజు ఒప్పందాలు, చేపల చెరువుల నిర్మాణాలు చట్టపరంగా చెల్లకుండా పోవడమే కాకుండా, వీటిని ప్రోత్సహిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సి ఉంటుంది అధికారుల నిర్లక్ష్యంపై గిరిజనుల నిలదీత! అధికార యంత్రాంగం ఈ అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వెనుక పెద్ద ఎత్తున అవినీతి చేతులు మారినట్లు స్పష్టమవుతోంది. గిరిజన సంక్షేమ శాఖ, రెవెన్యూ శాఖ, మరియు మత్స్య శాఖ అధికారులు ఈ వ్యవహారంలో ఒకరిపై ఒకరు నెపం నెట్టుకుంటూ కాలయాపన చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి అంకమ్మ చెరువు సమీపంలో జరుగుతున్న అక్రమ చేపల చెరువుల నిర్మాణాలను నిలిపివేయాలని, గిరిజనుల అసైన్మెంట్ భూములను వారికి తిరిగి అప్పగించాలని స్థానికులు గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.

# పోక్సో చట్టం సమర్థవంతంగా అమలు చేయండి

### సీఎం రేవంత్‌కి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ విజ్ఞప్తి

### నిర్భయ వార్త జిల్లా ప్రతినిది హైదరాబాద్:

తెలంగాణలో పోక్సో చట్టం సమర్థవంతంగా అమలు చేయడానికి తక్షణం చర్యలు చేపట్టాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కోరారు. ఈ మేరకు బుధవారం జనసేన పార్టీ తరపున తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ఆయన లేఖ రాశారు. పోక్సో కేసుల దర్యాప్తు, బాధితుల రక్షణకు సంబంధించిన పలు అంశాలపై ఆ లేఖలో ఏపీ డిప్యూటీ సీఎం ప్రత్యేక సూచనలు చేశారు. అలాగే ఈ కేసుల దర్యాప్తు 60 నుంచి 90 రోజుల్లో పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. బాధితులకు పూర్తి రక్షణ కల్పించే వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఆ లేఖలో ఏపీ డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ఈ కేసుల్లో బెయిల్‌ను గట్టిగా వ్యతిరేకించాలని పేర్కొన్నారు. బాధితులను బెదిరించే నిందితులపై కఠిన నిఘా అవసరమని అభిప్రాయపడ్డారు. బాధితులకు వైద్య పరీక్షలు 24 గంటల్లో పూర్తి చేయాలని ప్రతిపాదించారు. ఫోరెన్సిక్, డీఎన్ఏ ఆధారాలను త్వరితగతిన సేకరించాలని సూచించారు.

# ఫిజియోథెరపిస్ట్‌గా.. ప్రజా సేవకుడిగా.. మీ బిడ్డల బాధ్యత నాది": ఎమ్మెల్యే

### దివ్యాంగ విద్యార్థుల కోసం 'సమగ్ర శిక్ష – అలింకో' సంయుక్త ఆధ్వర్యంలో ఉపకరణాల పంపిణీ

### నిమ్స్‌లో సర్జరీలకు అయ్యే ఖర్చంతా నాదేనంటూ ఎమ్మెల్యే





అశ్వారావుపేట, జూలై 16 (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి)ఆకాశంలో సగం కాదు.. అవనిలో మేమూ భాగమేనంటూ శారీరక ఇబ్బందులను ఎదుర్కొంటూ ముందడుగు వేస్తున్న దివ్యాంగ విద్యార్థుల జీవితాల్లో అశ్వారావుపేట శాసనసభ్యులు జారే. ఆదినారాయణ భరోసానింపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యాశాఖ, తెలంగాణ సమగ్ర శిక్ష మరియు అలింకో (కూ×వీజూ) సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక అశ్వారావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం జరిగిన "ఉచిత సహాయక ఉపకరణాల పంపిణీ శిబిరం" కేవలం ఒక ప్రభుత్వ కార్యక్రమంలా కాకుండా, మానవత్వం పరిమళించిన ఒక గొప్ప వేదికగా నిలిచింది.ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు స్వయంగా దివ్యాంగ చిన్నారుల వద్దకు వెళ్లి వారికి ట్రై సైకిళ్లు, వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు వాకర్లు, బ్రెయిలీ కిట్లను అందజేస్తున్నప్పుడు ఆ చిన్నారుల కళ్లల్లో మెరిసిన ఆనందం, తల్లిదండ్రుల పెదవులపై విరిసిన చిరునవ్వులు అక్కడ చేరిన ప్రతి ఒక్కరి గుండెలను తాకాయి.పదవి కేవలం అధికారం కాదు.. బాధ్యత: ఎమ్మెల్యే మనసు లోతుల్లోంచి..ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన స్థానిక శాసనసభ్యులు ఆడంబరాల జోలికి పోకుండా, ఒక తండ్రిలా, ఒక అన్నలా చిన్నారులను పలకరించి వారితో మమేకమయ్యారు. తన రాజకీయ ప్రస్థానం వెనుక ఉన్న మానవీయ కోణాన్ని ఆయన సభ ముందు ఉంచినప్పుడు సభికులు హర్షధ్వానాలు చేశారు.నేను మొదలైంది మీ మధ్య నుంచే...రాజకీయాల్లోకి రాకముందు గత పదేళ్లుగా నేను ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్‌గా, ఫిజియోథెరపిస్ట్‌గా స్వయంగా ఎంతో మంది వికలాంగులకు సేవ చేశాను. ప్రతి ఆదివారం ఉదయాన్నే లేచి పక్షవాతంతో బాధపడుతున్న నిరుపేదల ఇళ్లకు వెళ్లి ఉచితంగా ఫిజియోథెరపీ చేసేవాడిని. అలా నేను సేవ చేసిన 82 మందిలో.. ఈరోజు 13 మంది తమ సొంత కాళ్లపై నడుస్తుంటే కలిగిన ఆనందం కోట్లాది రూపాయలు ఇచ్చినా దొరకదు. ఆ విజయమే నన్ను మీ ముందుకు తెచ్చింది. సమాజానికి నన్ను పరిచయం చేసింది ఆరోగ్య రంగమే.'నేను ఉన్నాను' అంటూ ఎమ్మెల్యే ఉచిత సర్జరీల భరోసా, చిన్నారులకు కేవలం థెరపీ మాత్రమే కాదు.. ఒకవేళ ఆపరేషన్లు అవసరమైతే నిమ్స్ ఆసుపత్రిలో ఎంత ఖర్చయినా నా వ్యక్తిగత నిధుల నుండి భరించి ఉచితంగా సర్జరీ చేయిస్తా. ఆ బాధ్యత నాది అని ఎమ్మెల్యే ప్రకటించి తల్లిదండ్రులకు కొండంత అండగా నిలిచారు.క్రీడా రంగంలో తోడ్పాటు, మన బిడ్డలు జాతీయ స్థాయిలో బీచ్ వాలీబాల్, స్కూల్ గేమ్స్‌లో రాణిస్తున్నారని హర్షం వ్యక్తం చేస్తూ, వికలాంగుల కోసం ప్రతి ఏటా నియోజకవర్గస్థాయిలో ప్రత్యేక క్రీడల టోర్నమెంట్ నిర్వహిస్తామని, దానికి అయ్యే పూర్తి ఖర్చును తానే స్పాన్సర్ చేస్తానని తెలిపారు.భవిత కేంద్రాల విస్తరణ, నియోజకవర్గంలో ప్రస్తుతం ఉన్న ఆరు భవిత కేంద్రాల ద్వారా చిన్నారులకు అవసరమైన ఫిజియోథెరపీ సేవలను మరింత మెరుగుపరుస్తామని, మిగిలిన మండలాల్లోనూ వీటిని విస్తరిస్తామని చెప్పారు.మండల విద్యాధికారి, ప్రసాద్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలల కంటే మిన్నగా తీర్చిదిద్దిన ఘనత ఎమ్మెల్యే గారికే దక్కుతుందన్నారు.ఎమ్మెల్యే గారి చొరవతో ఈ ఏడాది అశ్వారావుపేట హైస్కూల్‌లోనే రికార్డు స్థాయిలో 200 మంది కొత్త విద్యార్థులు చేరగా, అందులో ప్రైవేట్ స్కూళ్ల నుండి వచ్చినవారే 80 మంది ఉండటం విశేషం.దివ్యాంగ విద్యార్థుల రవాణా కోసం నెలకు 500 అలవెన్స్ అందిస్తున్నామని, స్కాలర్‌షిప్‌లు నేరుగా విద్యార్థుల ఖాతాల్లోకి జమవుతున్నాయని వివరించారు.శారీరక లోపం వెనుకబడిపోవడానికి కాదు. గెలవడానికి!ఈ శిబిరంలో చక్రాల కుర్చీని అందుకున్న ఒక చిన్నారి తండ్రి కన్నీళ్లు తుడుచుకుంటూ.. "నా బిడ్డను రోజు బడికి ఎత్తుకెళ్లడానికి చాలా కష్టమయ్యేది. ఇప్పుడు ఈ బండితో నా బిడ్డ స్వతంత్రంగా బడికి వెళ్లగలడు. ఈ సాయం చేసిన పెద్దలందరికీ జన్మజన్మల రుణపడి ఉంటాం, అని చెప్పిన మాటలు ఈ కార్యక్రమ విశిష్టతను చాటిచెప్పాయి.అశ్వారావుపేట నియోజకవర్గాన్ని కేవలం విద్యాపరంగానే కాకుండా, మానవతా దృక్పథంలోనూ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపడానికి కంకణం కట్టుకున్న శాసనసభ్యులకు, విద్యాశాఖ అధికారులకు, అలింకో సంస్థకు తల్లిదండ్రుల అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అశ్వరావుపేట మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జూపల్లి.రమేష్ బాబు, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవెల్లి వీరభద్ర,జిల్లా విద్యాశాఖ తరపున ప్లానింగ్ కోఆర్డినేటర్ కే సతీష్ , సమ్మిళిత విద్య కోఆర్డినేటర్ ఎస్కె సైదులు స్థానిక మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్, ఎమ్మార్వో,ఎంపీడీవో, ఎంఈఓ అశ్వారావుపేట ఎం. ప్రసాద్ రావు, దమ్మపేట ఎంఈఓ జగపతిరావు, కాంప్లెక్స్ స్కూల్ హెడ్మాస్టర్, మున్సిపల్ కౌన్సిలర్లు సమ్మిళిత, కట్టా సింధు, దండ బత్తుల ఆదిలక్ష్మి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిన్నంశెట్టి. సత్యనారాయణ, రాంబాబు, ( లాయర్) అల్లాడి. వెంకట్రామారావు, బూసి. పాండురంగారావు,అప్పలరాజు, ఆళ్ల సత్తిబాబు, విద్య వివిధ మండలాల కోఆర్డినేటర్లు రామారావు, రవికుమార్, రామ్మోహన్ శ్రావణ్ కుమార్ శు భాకర్, నాగలక్ష్మి కనకదుర్గ , రాజశ్రీ, లక్ష్మి, సీఆర్పీలు మండల విద్యా వనరుల కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# మాదక ద్రవ్యాల నిర్మూలనకు సమన్వయంతో చర్యలు చేపట్టాలి

### యువత భవిష్యత్తు కోసం డ్రగ్స్‌పై కఠిన చర్యలు అవసరం

### అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి




మేడ్చల్ మల్కాజ్గిరి కలెక్టరేట్ నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: మాదక ద్రవ్యాల వ్యసనం సమాజానికి, ముఖ్యంగా యువత భవిష్యత్తుకు తీరని నష్టాన్ని కలిగిస్తుందని, డ్రగ్స్ కారణంగా శారీరక, మానసిక సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో వాటి నిర్మూలనకు అన్ని శాఖలు సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన జిల్లా మాదక ద్రవ్య నిర్మూలన కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో డ్రగ్స్ నిర్మూలనకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, అన్ని శాఖలు బాధ్యతాయుతంగా అమలు చేయాలని సూచించారు.సంక్షేమ శాఖల అధికారులు ప్రతి నెల బాలుర వసతి గృహాల్లో డ్రగ్స్ దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మాదక ద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని సూచించారు.పోలీసు శాఖ అధికారులు జిల్లాలో నిరంతర తనిఖీలు నిర్వహిస్తూ, సున్నితమైన ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి డ్రగ్స్ సరఫరా, వినియోగాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.సంబంధిత శాఖలు తమ తమ కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి, అమలు చేసిన కార్యక్రమాల వివరాలను క్రమం తప్పకుండా జిల్లా యంత్రాంగానికి నివేదించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖలు సమిష్టిగా పనిచేసి మాదక ద్రవ్యాల నిర్మూలనలో జిల్లాను ఆదర్శంగా నిలపాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖాధికారి వినోద్ కుమార్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి పద్మజా, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మౌనిక, అదనపు డీసీపీలు పురుషోత్తం (కుత్బుల్లాపూర్), సుదర్శన్ (కూకట్‌పల్లి) వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 'మై భారత్' పోర్టల్ నమోదు కార్యక్రమానికి శ్రీకారం

### 15--29 ఏళ్ల యువత నమోదు చేసుకుని దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలి: అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్




మేడ్చల్ మల్కాజ్గిరి జూలై 15 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: దేశ నిర్మాణ కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'మై భారత్' పోర్టల్ నమోదు కార్యక్రమాన్ని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్, ఐఏఎస్ బుధవారం అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించిన ఆయన, 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయస్సు గల యువత పెద్ద సంఖ్యలో 'మై భారత్' పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ వేదిక ద్వారా స్వచ్ఛంద సేవ, అనుభవపూర్వక అభ్యాసం, నైపుణ్యాభివృద్ధి, సామాజిక సేవతో పాటు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ యువజన సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని తెలిపారు.జిల్లా వ్యాప్తంగా నిర్వహించే నమోదు కార్యక్రమంలో విద్యాసంస్థలు, ప్రభుత్వ శాఖలు, యువజన సంఘాలు, ఎన్ఎస్ఎస్ యూనిట్లు తదితర భాగస్వామ్య సంస్థలు చురుకుగా పాల్గొని అర్హులైన యువతను పెద్ద ఎత్తున నమోదు చేయించాలని సూచించారు. ఈ నమోదు కార్యక్రమాన్ని కళాశాలలు, విద్యాసంస్థలు, గ్రామాలు, పట్టణ స్థానిక సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో అవగాహన సదస్సులు, ప్రత్యేక నమోదు శిబిరాలు (ఆన్–ది–స్పాట్ రిజిస్ట్రేషన్ క్యాంపులు) నిర్వహిస్తూ విస్తృతంగా చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా 'మై భారత్' డిప్యూటీ డైరెక్టర్ స్నేహల్ జ్ఞానేశ్వర్ బసుత్కర్, కార్యాలయ సహాయకుడు డి. శ్రీశైలం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోర్టల్‌లో నమోదు విధానం, యువతకు లభించే అవకాశాలు, ప్రయోజనాలపై వారు వివరించారు.

# అర్హులైన ప్రతి ఓటరుకు ఎస్ఐఆర్ తుది ఓటరు జాబితాలో స్థానం కల్పించడమే లక్ష్యంలిజిల్లా కలెక్టర్ టి.ఎస్ దివాకర్




ఖమ్మం, జూలై 15 నిర్భయవార్త రిపోర్టర్.ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి ఎస్ఐఆర్ కార్యక్రమ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్. కార్యక్రమంలో భాగంగా బీఎల్‌వోలు జూలై 24 వరకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూలై 24 నాటికి పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పూర్తి చేసి, జూలై 31న ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురిస్తామని తెలిపారు. జూలై 31 నుండి ఆగస్టు 30 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరించి, సెప్టెంబర్ 28 నాటికి వాటిని పరిష్కరించి అక్టోబర్ 1న తుది ఓటరు జాబితాను ప్రచురిస్తామని తెలిపారు.జిల్లాలో మొత్తం 1,460 పోలింగ్ స్టేషన్లు, 12,43,781 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటి వరకు 8,48,491 మంది ఓటర్ల వివరాలను డిజిటలైజ్ చేశామని తెలిపారు. ఇది 68.22 శాతం పురోగతికి సమానమని, ఇంకా 3,95,290 మంది ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ పూర్తి చేయాల్సి ఉందన్నారు.ఇప్పటికే డిజిటలైజ్ చేసిన వివరాల్లో సుమారు 72 వేల ఓట్లకు సంబంధించిన అనామలీలుగా గుర్తించామని, వాటిని రానున్న రెండు నెలల్లో విచారణ ద్వారా పరిష్కరిస్తామని తెలిపారు.సుమారు 25 వేల మంది ఓటర్లు కేవలం ఎన్యూమరేషన్ ఫారాలను మాత్రమే సమర్పించి, అవసరమైన వివరాలు నమోదు చేయకపోవడంతో మ్యాపింగ్ జరగలేదని తెలిపారు. అటువంటి వారికి నోటీసులు జారీ చేస్తామని, నోటీసులు అందిన వెంటనే అవసరమైన ధృవీకరణ పత్రాలు సమర్పిస్తే పరిశీలించి, అర్హులైన వారి పేర్లను తుది ఓటరు జాబితాలో చేర్చుతామని స్పష్టం చేశారు.డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదలైన తర్వాత మ్యాపింగ్ సక్రమంగా జరగని వారి వివరాలపై ఎన్నికల అధికారులు సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీచేస్తారని తెలిపారు. నోటీసులకు నిర్దేశిత సమయంలో స్పందించి అవసరమైన పత్రాలు సమర్పిస్తే వాటిని పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరి పేరును తుది ఎస్ఐఆర్ ఓటరు జాబితాలో చేర్చుతామని అన్నారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో 12 రకాల ధ్రువీకరణ పత్రాలను ఆధారాలుగా పరిగణిస్తామని కలెక్టర్ తెలిపారు. అవసరమైన పత్రాల కోసం ప్రజలు మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకుంటే సంబంధిత శాఖల ద్వారా వెంటనే జారీ చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఓటరుకు ఎస్ఐఆర్ తుది ఓటరు జాబితాలో స్థానం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.ప్రస్తుతం అధికారులు 85 శాతం వరకు డిజిటలైజేషన్ పూర్తి చేయగలరని, అయితే 100 శాతం పూర్తి కావాలంటే ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. బీఎల్‌వోలు పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను ప్రజల నుంచి తిరిగి సేకరించేందుకు సహకరించాలని, ఓటర్లు పూర్తి వివరాలతో ఫారాలను అందజేసేలా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.వీలైనంత ఎక్కువ మంది ఓటర్ల మ్యాపింగ్ పూర్తయ్యేలా అందరూ కృషి చేయాలని, తక్కువ సంఖ్యలో మాత్రమే మ్యాపింగ్ కాని ఓటర్లు మిగిలితే వారికి అవసరమైన పత్రాలు సేకరించి తుది జాబితాలో చేర్చడం సులభమవుతుందని కలెక్టర్ అన్నారు.అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ ఎన్యూమరేషన్ ఫారం అందని ఓటర్లు ఆన్‌లైన్ ద్వారా కూడా ఫారాన్ని పొందవచ్చని తెలిపారు. ఎవరికైనా ఫారం అందకపోతే వెంటనే సంబంధిత బీఎల్‌వోను సంప్రదించి ఫారం తీసుకోవాలని సూచించారు.

# ఎన్ఐటీ రూర్కేలా ఎంబీఏ విద్యార్థికి రూ.1 లక్ష ఆర్థిక చేయూత.

### విద్యార్థుల ఉన్నత విద్యకు అండగా నిలుస్తున్న ఖమ్మం జిల్లా ఎన్ ఆర్ ఐ ఫౌండేషన్ – వేముల తేజ ఉదార విరాళం

ఖమ్మం జూలై 15 నిర్భయవార్త రిపోర్టర్.ఆర్థిక ఇబ్బందులు ప్రతిభకు అడ్డంకి కాకూడదనే మహోన్నత లక్ష్యంతో ఖమ్మం జిల్లా ఎన్ఆర్ఐ ఫౌండేషన్ మరోసారి తన సేవా దృక్పథాన్ని చాటుకుంది. దేశంలోని




ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ఒకటైన ఎన్ఐటీ రూర్కేలాలో ఎంబీఏ విద్యను అభ్యసిస్తున్న గడ్డం వెంకటేశ్వర్లు రెండో సెమిస్టర్ ఫీజు చెల్లింపునకు అవసరమైన రూ.1,00,000 ఆర్థిక సహాయాన్ని ఫౌండేషన్ సౌజన్యంతో అందజేశారు. ఈ సహాయాన్ని దాత వేముల తేజ (వేముల గోపయ్య, మంగమ్మ దంపతుల కుమారుడు) అందించడం విశేషం.ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పలువురు విద్యావేత్తలు, అధ్యాపకులు, సామాజిక సేవకులు, దాతలు పాల్గొని విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్య ద్వారా మాత్రమే వ్యక్తి, కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ప్రతిభ కలిగిన విద్యార్థులు ఆర్థిక సమస్యల కారణంగా తమ లక్ష్యాలకు దూరం కాకుండా చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు.ఫౌండేషన్ అధ్యక్షుడు బయ్యాన బాబురావు మాట్లాడుతూ విద్యా సేవే అత్యున్నత సేవ అని, పేద ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి వారికి అవసరమైన సహాయాన్ని అందించడం ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సమాజంలోని దాతలు మరింత ముందుకు వచ్చి విద్యార్థులకు అండగా నిలిస్తే రాష్ట్రం, దేశం మరింత మంది ప్రతిభావంతులను అందుకుంటుందని పేర్కొన్నారు.దాత వేముల తేజ మాట్లాడుతూ, విద్య కోసం చేసే విరాళం భవిష్యత్ తరాలకు పెట్టుబడిగా నిలుస్తుందని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రతిభావంతులైన విద్యార్థులకు చేయూత అందించడం తన బాధ్యతగా భావిస్తున్నానని, భవిష్యత్తులో కూడా ఇటువంటి సేవా కార్యక్రమాలకు తన వంతు సహకారం కొనసాగిస్తానని తెలిపారు. ఎస్ ఆర్ బి జి ఎన్ ఆర్ ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు సూరంపల్లి రాంబాబు మాట్లాడుతూ, ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు సమాజం నుంచి లభించే ప్రోత్సాహం వారి ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచుతుందని పేర్కొన్నారు. ఫౌండేషన్, దాత వేముల తేజ చేపట్టిన ఈ కార్యక్రమం మరెందరికో ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు.సహాయం అందుకున్న గడ్డం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఉన్నత విద్యను కొనసాగించేందుకు చేయూతనిచ్చిన వేముల తేజ కి, ఎన్ఆర్ఐ ఫౌండేషన్ వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే విధంగా సేవ చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా వేముల తేజ తల్లితండ్రులను కళాశాల అధ్యాపకులు సన్మానించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.శ్రీనివాస్, స్టాఫ్ క్లబ్ కార్యదర్శి డా. బి.శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి రవికుమార్, సుజాత, తదితరులు పాల్గొని విద్యార్థికి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న బీజేపీ ప్రభుత్వం.-

### ఏఏవై 35 కిలోల బియ్యం రద్దు సరికాదు -వ్యకాస



సింగరేణి జులై 15 నిర్భయవార్త రిపోర్టర్. నిత్యావసర ధరలు విపరీతంగా పెరుగుతున్న తరుణంలో పేద ప్రజలకు ఉపశమనం కలగడానికి ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం దానిని నిర్వీర్యం చేస్తుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం కారేపల్లి లో చౌక ధర దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడారు వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరావు మాట్లాడుతూ చౌక దుకాణాల ద్వారా 14 రకాల నిత్యవసర వస్తువులు పంపిణీ చేయాల్సిన ప్రభుత్వం బియ్యం పంపిణీ తోనే సరిపోతుంది అని అన్నారు. అత్యంత పేదలు నిర్భాగ్యులకు అంత్యోదయ అన్నపూర్ణ (ఏఏవై) కార్డు ల ద్వారా అందించే 35 కిలోల బియ్యం రద్దు చేయడం పేదల కడుపు కొట్టడమే అని అన్నారు. కార్డు కు 35 కిలోలు బియ్యం ఇచ్చేదాన్ని తగ్గించి మనిషికి ఏడు కిలోల ఇవ్వడం అవివేకం అన్నారు. అంత్యోదయ అన్నపూర్ణ రేషన్ కార్డు కొనసాగించాలని, చౌక దుకాణాల ద్వారా 14 నిత్యవసర వస్తువులు సరఫరా చేయాలని డిమాండ్ తో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం చేపట్టే నిరసన కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని కోరారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత.




సింగరేణి జూలై 15 నిర్భయవార్త రిపోర్టర్ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్న వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ సహకారంతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను సింగరేణి గ్రామ పంచాయతీ కి చెందిన టంటం వెంకన్న, గంగారబోయిన స్పందన లబ్ధిదారులకు సింగరేణి సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ (టోనీ) మండల అధ్యక్షుడు తోటకూరి రాంబాబు ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా టోనీ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా తాను నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవ చేయడం తన బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూరి రాంబాబులి, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ తాజుద్దీన్, సురేంద్ మనియార్, రాములు ఎండి యాకూబ్ అలీ, ఎస్ కే షఫీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## షెడ్యూల్ ఏరియాలో పెసా గ్రామసభ అత్యున్నత మైనది.

### జిల్లా కన్వీనర్ కుంజ మహేష్

### జిల్లా కలెక్టర్ కు తీర్మానం అందజేసిన కొండాపురం ఆదివాసీలు షెడ్యూల్ చట్టాలను అమలు చేయక పోతే పోరు బాట పడతాం



ములుగు జూలై 15 (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి) కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఐదో షెడ్యూల్ ప్రాంతంలో రాజ్యాంగ బద్ద పాలన కొనసాగించడం లో వివక్షత చూపుతున్నారని ఆదివాసీ నవనిర్మాణ సేన ములుగు జిల్లా కన్వీనర్ కుంజ మహేష్ పేర్కొన్నారు. కొండాపురం గ్రామంలో మంగళవారం పెసా గ్రామసభ నిర్వహించినారు. పెసా గ్రామసభ తీర్మాణాన్ని ములుగు జిల్లా కలెక్టర్ హన్మంత్ కి బుధవారం అందజేసినట్టు తెలిపారు. ఇటీవలే ప్రభుత్వం జారీ చేసిన అంగన్వాడీ ఉద్యోగుల భర్తీ ప్రక్రియ నోటిఫికేషన్ షెడ్యూల్ చట్టాలను ఉల్లాంఘించే విధంగా ఉందని ఆదివాసీల హక్కులను కాలరాస్తోందని భావించిన ఆదివాసీలు పెసా గ్రామసభ నిర్వహించు కొని మావ నాటే మావ రాజ్యం నినాదాన్ని నిజం చేస్తూ ఏక గ్రీవంగా తీర్మానం చేసినారు అని అన్నారు . కొండాపురం గ్రామం లో గతంలో చదువుకున్న ఆదివాసీ మహిళలు లేక ఎస్సి గిరిజనేతర మహిళకు అంగన్వాడీ టీచర్ ఉద్యోగం కేటాయించినట్టు మహేష్ అన్నారు. ఇప్పుడు కూడా ఆయా ఉద్యోగాన్ని ఎస్సి గిరిజనేతర మహిళకు కట్టబెట్టడాన్ని ఆదివాసీలు పెసా గ్రామసభ ద్వారా చట్ట బద్దంగా వ్యతిరేకించినట్టు తెలిపారు. ఎస్సి బీసీ ఓసి ఎవరైనా ప్రభుత్వం కూడా షెడ్యూల్ ఏరియాలో గిరిజనేతరులే అని రాజ్యాంగం చెప్తోందని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు వ్యాఖ్యాణించినట్టు ఆయన వివరించారు. ఆదివాసీలకు ఎవరికి వ్యతిరేఖం కాదని అన్నారు. రాజ్యాంగ బద్దంగా షెడ్యూల్ ఏరియాలో షెడ్యూల్ ట్రైబల్స్ దక్కాలసిన రాజ్యాంగ ఫలాలను దక్కకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## అద్దంకి కి మంత్రి హోదా దళితులకు దక్కిన గౌరవం

### - దళితుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం....

### - జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షులు తోటమల్ల రమణమూర్తి,....

చర్ల జులై 15 నిర్భయ వార్త ప్రతినిధి.జాతీయ మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ డాక్టర్ అద్దంకి దయాకర్ కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంత్రి హోదా కల్పించడం రాష్ట్రంలోని దళితులకు, తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన సరైన గౌరవమని జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షులు తోటమల్ల రమణమూర్తి, జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షులు ఎడెల్లి గణపతి వెల్లడించారు. బుధవారం ఈ మేరకు మండల కేంద్రంలో



జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షులు తోటమల్ల రమణమూర్తి మాట్లాడుతూ డా. అద్దంకి దయాకర్ తెలంగాణ రాష్ట్ర సాధనలో, దళితుల హక్కుల కోసం పలు సందర్భాల్లో చేసిన పోరాటాలకు ప్రతిఫలంగానే కాంగ్రెస్ ప్రభుత్వం అద్దంకి దయాకర్ ను ఎమ్మెల్సీగా, ప్రభుత్వ విప్‌గా నియమించిందని, నాటి నుండి ఆయన చేస్తున్న సేవలను గుర్తించి మంత్రి హోదా ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం అభినందనీయమని,ఇది రాష్ట్రంలోని కోట్లాది దళితులకు దక్కిన గౌరవం. దళితుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం వేస్తున్న అడుగులకు ఇది నిదర్శనం" అన్నారు.జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షులు ఎడెల్లి గణపతిలి మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని, దళిత ప్రాంతాల అభివృద్ధికి, సంక్షేమ పథకాల అమలుకు డా. దయాకర్ గారి నాయకత్వం మరింత ఉపయోగపడుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయానికి ఇచ్చే ప్రాధాన్యతకు ఇది నిదర్శనమని ఎస్సీ కార్పొరేషన్, గురుకులాలు, ఇతర సంక్షేమ పథకాలకు మరింత నిధులు వస్తాయని ఆశిస్తున్నామని అన్నారు.జిల్లా ఉపాధ్యక్షులు పల్లంటి రమేష్ మాట్లాడుతూ "ఈ రోజు మా ఉద్యమ నాయకుడికి మంత్రి హోదా రావడం మాకు పండగ లాంటిది. డా. అద్దంకి దయాకర్ అసెంబ్లీలో, ప్రతి చోటా దళితుల గొంతుగా ఉన్నారు. ఇప్పుడు మంత్రి హోదాతో ఆయన చేతికి మరింత అధికారం వచ్చింది. సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం చరిత్రలో నిలిచిపోతుంది" అని అన్నారు.ఈ కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ సభ్యులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేసుకొని,స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు.

## అపూర్వ జనసందోహం మధ్య వైభవంగా జన్మదిన వేడుకలు

### సేవా కార్యక్రమాలతో ప్రత్యేక ఆకర్షణ..

### ప్రజా సేవకు మరింత అంకితమవుతానన్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు

కూకట్‌పల్లి, జూలై 15 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, టీపీసీసీ



ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ జన్మదిన వేడుకలు బుధవారం కూకట్‌పల్లిలోని ఎన్‌కేఎన్‌ఆర్ గార్డెన్స్‌లో అపూర్వ జనసందోహం మధ్య అత్యంత వైభవంగా నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కమ్మ సంఘం ప్రతినిధులు, సామాజిక సంస్థల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భారీ కేక్‌ను కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పూలమాలలు, పుష్పగుచ్ఛాలు, శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించగా,



కార్యకర్తల జైకారాలు, శుభాకాంక్షలతో ఎన్‌కేఎన్‌ఆర్ గార్డెన్స్ ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది.వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా కమ్మ సంఘం నాయకులు ఘన సన్మానం నిర్వహించారు. సమాజ అభ్యున్నతి కోసం చేపడుతున్న కార్యక్రమాలను కొనియాడుతూ శాలువా కప్పి, పూలమాలలు వేసి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రజా సేవలో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనపై చూపుతున్న ప్రేమ, ఆదరణ, అభిమానానికి ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.




జన్మదినాన్ని కేవలం వేడుకగా కాకుండా ప్రజా సేవకు మరింత అంకితమయ్యే సంకల్ప దినంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ కూకట్‌పల్లి నియోజకవర్గ అభివృద్ధి, పేదల సంక్షేమం, యువతకు అవకాశాల కల్పనతో పాటు కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు.జన్మదిన వేడుకల సందర్భంగా అన్నదాన కార్యక్రమం, కేక్ పంపిణీ, పేదలకు పండ్ల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వేలాది మంది నాయకులు, కార్యకర్తలు, అభిమానుల పాల్గొనడంతో కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగింది. ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానుల విశేష హాజరు ఈ వేడుకలకు ప్రత్యేక శోభను తీసుకురాగా, నాయకత్వంపై నెలకొన్న ఆదరణకు నిదర్శనంగా నిలిచింది.

## విద్య ద్వారా ప్రయోజకులు కావాలి...

### వనవాసీ విద్యార్థులకు కానిస్టేబుల్ ప్రసాద్ ఉద్బోధ.

చర్ల, జూలై 15 నిర్భయ వార్త ప్రతినిధి.విద్య ద్వారా ప్రయోజకులు కావాలని ఇందుకు గాను ఇప్పటి నుండే ఖచ్చితమైన ప్రణాళిక రూపొందించుకోవాలని ములుగు జిల్లా వెంకటాపురం పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా విదులు నిర్వహిస్తున్న వేమాల ప్రసాద్ ఉద్బోధించారు. ప్రసాద్ - సునీత దంపతుల ద్వితీయ కుమారుడు నిహాల్ జన్మదినం సందర్భంగా వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం నిలయ విద్యార్థులకు ఒక జత దుస్తులతో పాటు కంబాక్స్ లు, పెన్నులు, పెన్సిల్స్, పండ్లను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా వనవాసీ



కొమరం భీం నిలయ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రసాద్ విద్యార్థులను ఉద్దేసించి మాట్లాడాను. ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టి సారించి ఉన్నత స్దితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. తాము ఏమి కావాలో చిన్ననాటి నుండే లక్ష్యాన్ని నిర్దేసించుకొని ముందుకు సాగినప్పుడే అనుకున్న లక్ష్యాన్ని సాదించవచ్చని అన్నారు. ఇక్కడి విద్యార్థుల క్రమశిక్షణ తనకు ఎంతగానో ఆకట్టుకుందని అందుకే వెంకటాపురంలో విదులు నిర్వహిస్తున్నప్పటికితమ కుమారుని జన్మదినం ఇక్కడ జరుపుకుని వితరణలను అందచేసామన్నారు. కొమరం భీం నిలయ కార్యదర్శి మురళీకృష్ణ మాట్లాడుతూ జన్మదినం, శుభ, కార్యక్రమాలతో పాటు ఇతర సందర్భాలలో డబ్బు వృదా చేయకుండా విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాలను చేపట్టడం అబినందనీయమని అన్నారు. సంస్ద ప్రభుత్వం నుండి ఎటువంటి ఆర్దిక సహకారం, ఇతర సౌకర్యాలను పొందదని కేవలం దాతల సహకారంతో నడుస్తుందని వెల్లడించారు. గిరిజనుల అభ్యున్నతి కొరకు సంస్ద దేశ వ్యాపితంగా విద్యార్ది నిలయాలను నిర్వహిస్తోందని తెలిపారు. వనవాసీ విద్యార్థులకు దాతలు అందచేస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు ఇటువంటి అవకాశాలను సద్వినియోగపరుచుకొని దాతల నమ్మకాన్ని వమ్ముచేయకుండా చదువుపై దృష్టిసారించి ఉన్నత స్దితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యతోనే వినయం విదేయత వస్తుందని, కుటుంబంలో ఒక్కరు చదువుకొని జీవితంలో స్దిరపడితే ఆకుటుంభం మొత్తం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అందుకే తాము విద్యపై దృష్టిసారించి పేద విద్యార్థులకు సహకారమందించడంతో పాటు వారిని ప్రోత్సహిస్తున్నట్లు వెల్లడించారు. గిరిజన విద్యార్దుల సంక్షేమం, అభ్యున్నతి కొరకు పాటుపడే సంస్దకు దాతలు తమవంతు సహకారమందించి విద్యార్థుల జీవితాలలో వెలుగులు నింపాలని విజ్ఞప్తి చేసారు. కార్యక్రమంలో వేమాల సునీత, వనవాసీ జిల్లా సహ కార్యదర్శి గోగికార్ రాంలక్ష్మణ్, జిల్లా సంఘటనా సహ కార్యదర్శి గొంది శోభన్ బాబు, కొమరం భీం నిలయ ప్రముఖ్ ఆకుల సాంబయ్య, శబరి బాలికా నిలయ ప్రముఖ్ వరలక్ష్మి, మడకం చందు, కూడం ఉంగయ్య, ప్రసాద్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుపై దాడి ఘటనపై చర్యలు తీసుకోవాలి

### పోలీసులకు టిడబ్ల్యూజేఎఫ్ నాయకుల వినతి..

### మీడియా స్వేచ్ఛను కాపాడాలని డిమాండ్



కీసర, జూలై 15 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: కాలనీలో రోడ్డు ఆక్రమణపై వార్త ప్రచురించిన జర్నలిస్టుపై దాడికి పాల్పడిన వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మేడ్చల్ జిల్లా టిడబ్ల్యూజేఎఫ్ (తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్) నాయకులు కీసర పోలీసులను కోరారు. కీసర సర్కిల్ పరిధిలోని కుందన్ మనీషా కాలనీలో ఓ ఇంటి యజమాని రహదారిని ఆక్రమించి నడిరోడ్డుపై భారీ బండరాళ్లు ఉంచడంతో ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులు, ప్రమాదాల అవకాశాలపై సూర్యవెలుగు రిపోర్టర్ శివారెడ్డి వార్త ప్రచురించారు. ఈ వార్తపై ఆగ్రహం వ్యక్తం చేసిన సంబంధిత ఇంటి యజమాని, "మాపైనే వార్త రాస్తావా" అంటూ కొందరు వ్యక్తులతో కలిసి జర్నలిస్టు శివారెడ్డి నివాసానికి వెళ్లి దాడికి పాల్పడ్డారని పోలీసులకు అందజేసిన వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండించిన టిడబ్ల్యూజేఎఫ్ నాయకులు, వార్తలు రాసినందుకు జర్నలిస్టులను బెదిరించడం, దాడులకు పాల్పడడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. నిందితులపై వెంటనే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత జర్నలిస్టుకు రక్షణ కల్పించాలని కీసర పోలీసులను కోరారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు గుమ్మడి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, జిల్లా కార్యదర్శి బనావత్ రవి నాయక్, మేడ్చల్ నియోజకవర్గ కన్వీనర్ అంబాల విష్ణు, సత్యం, శ్రీనివాస్ రెడ్డి, బాలకృష్ణ, నర్సింహా, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ములుగు ఎస్పీని కలిసిన రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ మిల్లర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వినతి.



ములుగు జులై 15, (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి): ములుగు జిల్లా ఎస్పీ కేకాన్ సుధీర్ రామ్నాథ్‌ను రైస్ మిల్లర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాదం ప్రవీణ్ ఆధ్వర్యంలో మిల్లర్లు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మిల్లర్ల సమస్యలను వివరించే వినతిపత్రాన్ని ఎస్పీకి అందజేసి, వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. బాదం ప్రవీణ్ మాట్లాడుతూ, 2025--26 రబీ సీజన్‌లో ములుగు జిల్లాలోని మిల్లుల సామర్థ్యానికి మించి ధాన్యాన్ని ఓపెన్ స్టోరేజీల్లో నిల్వ చేయించారని తెలిపారు. ఈ ప్రక్రియలో పోలీసు ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ధాన్యాన్ని బలవంతంగా దిగుమతి చేయించిన పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు.ప్రస్తుతం ప్రభుత్వం బియ్యాన్ని ఎత్తుకుపోకపోవడం, ఎఫ్‌సీఐ గోదాముల కొరత కారణంగా మిల్లర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమయం గడుస్తున్న కొద్దీ ధాన్యం నాణ్యత దెబ్బతిని, డ్యామేజ్ పెరగడంతో పాటు వెయిట్ లాస్ కారణంగా భారీ నష్టాలు వస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ విధానాల వల్ల భవిష్యత్తులో మిల్లర్లు ఆర్థికంగా నష్టపోయి ప్రభుత్వానికి బాకీ పడే పరిస్థితి ఏర్పడినా, తమపై ఎలాంటి క్రిమినల్ చర్యలు తీసుకోకుండా చూడాలని ఎస్పీని కోరారు. దీనిపై స్పందించిన ఎస్పీ కేకాన్ సుధీర్ రామ్నాథ్, మిల్లర్ల సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు బాదం ప్రవీణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్ అసోసియేషన్ కోశాధికారి ఎలగందుల మోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొమురవెల్లి హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## నాందేడ్ నుంచి తిరుచానూరుకు ప్రత్యేక రైళ్లు

నిర్భయ వార్త ప్రతినిదిపెద్దపల్లి: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే నాందేడ్ - తిరుచానూర్ - నాందేడ్ మధ్య ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రకటిం చింది. ఈ ప్రత్యేక రైళ్లు పెద్దపల్లి రైల్వే స్టేషన్‌తోపాటు కరీంనగర్, వరంగల్, విజయవాడ తదితర ప్రధాన స్టేషన్లలో రెండు దిశల్లోనూ ఆగనున్నాయి. రైల్వేశాఖ అధికారులు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 07603 నాందేడ్-తిరుచానూర్ ప్రత్యేక రైలు ఈనెల 21 నుంచి ఆగస్టు 25 వరకు ప్రతీ మంగళవారం నడుస్తుంది.మొత్తం ఆరు సర్వీసులు అందుబాటులో ఉంటాయి. అలాగే 07604 తిరుచానూర్ - నాందేడ్ ప్రత్యేక రైలు ఈనెల 22 నుంచి ఆగస్టు 26 వరకు ప్రతీ బుధవారం నడపనున్నారు. ఈ రైలును కూడా మొత్తం ఆరుసార్లు నడపనున్నారు.

# బలమైన భవిష్యత్తుకు బాల్యమే పునాది

## ప్రతి అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా అధికారులు నిరంతరం సందర్శించాలి

## నాసిరకం సరుకులు సరఫరా చేస్తే కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెడతాం

## ఒక్క బాల్య వివాహం కూడా జరగొద్దు బాల్య వివాహ రహిత తెలంగాణగా నిలవాలి

## ఉత్తమ సేవలందించే అంగన్‌వాడీ సిబ్బందికి ఆగస్టు 15న సన్మానం

## వచ్చే నెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకం

## మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా దనసరి అనసూయ సీతక్క






ములుగు జూలై 15 (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి) బలమైన భవిష్యత్తుకు బాల్యమే పునాది అని, చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం, విద్య, సంరక్షణ అందిస్తేనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలమని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అన్నారు. పిల్లలకు పథకాలు అందించడం ఒక మెట్టు మాత్రమేనని. వారు అంగన్‌వాడీ కేంద్రాలకు రావడం, ఆరోగ్యంగా, హుషారుగా ఎదగడం, వారి మేధాశక్తి పెరగడం అసలైన లక్ష్యమని స్పష్టం చేశారు.మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై మంత్రి సీతక్క బుధవారం సచివాలయంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార సరఫరా, టేక్ హోమ్ రేషన్ టిహెచ్ఆర్, అంగన్వాడీ తొలిముద్ద (బ్రేక్‌ఫాస్ట్ పథకం), అమ్మ మాట--అంగన్‌వాడీ బాట, నూతన అంగన్‌వాడీ భవనాల నిర్మాణం, మౌలిక వసతులు, నియామకాలు, బాల్య వివాహాల నివారణ, శిశు రక్షణ, దత్తత ప్రక్రియతో పాటు వివిధ పథకాల బడ్జెట్ విడుదల, వ్యయంపై జిల్లాల వారీగా మంత్రి సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, “మీ పిల్లలు, మనవరాళ్ల వయస్సు ఉన్న చిన్నారులే అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్నారు. వారిని సొంత పిల్లలుగా భావించి సేవ చేయాలి. పిల్లలు అంగన్‌వాడీకి రావడం ఒక మెట్టు... వారు హుషారుగా, ఆరోగ్యంగా ఎదగడం మరో ఎత్తు. వారి మేధాశక్తిని పెంచేలా మన సేవలు ఉండాలి” అని అధికారులకు సూచించారు.గతంలో ఉమ్మడి జిల్లాలు చాలా పెద్దగా ఉండేవని, ప్రస్తుతం చిన్న జిల్లాలు ఏర్పడినందున మారుమూల చివరి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా జిల్లా అధికారులు సందర్శించాలని మంత్రి ఆదేశించారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారులు, సూపర్‌వైజర్లు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న భోజనం నాణ్యతను పరిశీలించేందుకు బి డబ్ల్యులు, సూపర్‌వైజర్లు తరచూ కేంద్రాల్లో భోజనం చేయాలని సూచించారు. కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో భోజనం చేయడం వల్ల మధ్యాహ్న భోజన నాణ్యత పెరిగినట్లే అంగన్‌వాడీల్లో కూడా ఇదే విధానాన్ని అమలు చేయాలని ఆదేశించారు.గుడ్లు, పప్పు, పాలు, ఇతర పోషకాహార పదార్థాల ఇండెంట్, సరఫరాలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని మంత్రి సీతక్క హెచ్చరించారు. నాసిరకం సరుకులు సరఫరా చేసినా సంబంధిత కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెడతామని హెచ్చరించారు. “మీకు నాణ్యమైన సరుకులు రాకపోతే ముందుగానే మాకు రిపోర్ట్ చేయండి. పిల్లలకు క్వాలిటీ ఫుడ్ అందాలి. గర్భిణులు, బాలింతల విషయంలోనూ ఎలాంటి రాజీ ఉండదు. మంచి జరిగినా, లోపం ఉన్నా మీ అనుభవాలను మాకు తెలియజేయండి. వాటి ఆధారంగా సేవలను మరింత మెరుగుపరుస్తాం” అని తెలిపారు.ఒకటి రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో నాసిరకం కోడి గుడ్లు సరఫరా చేశారని పత్రికల్లో వచ్చిన కథనాలను తీవ్రంగా పరిగణిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ఆయా వార్తలపై జిల్లా అధికారులు వెంటనే సమగ్ర నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. శాఖ పరిధిలో మహిళలు, పిల్లలకు సంబంధించి ఏదైనా తీవ్రమైన ఘటన జరిగినా తక్షణమే ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి సమాచారం అందించాలని స్పష్టం చేశారు.పైలట్ ప్రాజెక్టుగా భద్రాద్రి కొత్తగూడెం, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో అమలు చేస్తున్న బ్రేక్‌ఫాస్ట్ పథకం మంచి ఫలితాలు ఇస్తోందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమం వల్ల చిన్నారుల హాజరు పెరగడంతో పాటు వారి అభ్యాస సామర్థ్యం కూడా మెరుగుపడుతోందన్నారు. వచ్చే నెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అమలు చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.“అమ్మ మాట--అంగన్‌వాడీ బాట” కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్య ఎంత మేర పెరిగిందో జిల్లాల వారీగా నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. పాలు అందించడం వంటి నూతన కార్యక్రమాల ఫలితాలను కూడా క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయాలన్నారు.ఇప్పటికే ప్రభుత్వం మంజూరు చేసిన 2,500 నూతన అంగన్‌వాడీ భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. భూమి సమస్యలు ఉన్న ప్రాంతాల్లో అంగన్‌వాడీ టీచర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌ల సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అవసరాన్ని బట్టి భవిష్యత్తులో మరో 2,500 నుంచి 3,000 అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి చర్యలు చేపడతామని తెలిపారు. ఇప్పటికే మంజూరైన భవనాలను నిర్దిష్ట గడువులో పూర్తి చేసి, ముఖ్యమంత్రి చేతుల మీదుగా రాష్ట్రవ్యాప్తంగా వర్చువల్ విధానంలో ఒకేసారి ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.నూతన అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారులకు మానసిక ఆహ్లాదాన్ని కలిగించే రంగులతో ఆకర్షణీయంగా ఉండాలని సూచించారు. విద్యుత్, తాగునీరు, టాయిలెట్లు, పైప్‌లైన్ నీటి కనెక్షన్ వంటి మౌలిక వసతులు తప్పనిసరిగా కల్పించాలని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల వద్ద మొక్కలు నాటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు.వలస కార్మికుల పిల్లల కోసం కార్మిక శాఖ సహకారంతో మొబైల్ అంగన్‌వాడీలను ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. మిగిలిన ప్రాంతాల్లోనూ అవసరమైన మొబైల్ అంగన్‌వాడీలను ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మారుమూల గుత్తికోయ గూడేల్లోని చిన్నారులకు కూడా పోషకాహారం, ఫీడింగ్ సేవలు పూర్తి స్థాయిలో అందాలని స్పష్టం చేశారు. ఏ ఒక్క చిన్నారి ప్రభుత్వ సేవలకు దూరం కాకూడదన్నారు.అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను చూసి చిన్నారులు నేర్చుకుంటారని, అందువల్ల సిబ్బంది ప్రవర్తన, క్రమశిక్షణ ఆదర్శంగా ఉండాలని మంత్రి సూచించారు. పిల్లలతో ఎలా మాట్లాడాలి, ఎలా మెలగాలి, వారి మానసిక వికాసానికి ఎలా తోడ్పడాలనే అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అంగన్‌వాడీల్లో చిన్నారులకు రోజు వారి జీవితానికి అవసరమైన వివిధ అంశాలను పరిచయం చేస్తూ వారి మేధాశక్తి, గ్రహణశక్తి పెంచేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారుఅంగన్‌వాడీ నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. ఇప్పటికే 12 జిల్లాల్లో నోటిఫికేషన్లు జారీ చేసి దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోందని, ఒకటి రెండు రోజుల్లో మిగిలిన జిల్లాల్లోనూ నోటిఫికేషన్లు విడుదల చేయాలని సూచించారు. నియామకాలు ఎలాంటి వివాదాలకు తావులేకుండా, పూర్తి పారదర్శకంగా, మెరిట్ ప్రాతిపదికన జరగాలని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ సిబ్బందికి పిల్లలతో సున్నితంగా వ్యవహరించే మానసిక స్వభావం, మాతృత్వ భావన ఉన్నాయా అనే అంశాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.రాష్ట్రాన్ని బాల్య వివాహాల రహిత తెలంగాణగా తీర్చిదిద్దాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. “మన పరిధిలో ఒక్క బాల్య వివాహం కూడా జరగకూడదు. బాల్య వివాహాలు లేని రాష్ట్రంగా తెలంగాణ నిలవాలి” అని స్పష్టం చేశారు. బాల్య వివాహాల నివారణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శిశు సంరక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు దత్తత ప్రక్రియను వేగవంతం చేసి ప్రత్యేక దత్తత సంస్థల ఏర్పాటును త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**బాగా పనిచేసే వారిని ఆగస్టు 15న సన్మానిద్దాం**

అంగన్‌వాడీ వ్యవస్థలో అంకితభావంతో పనిచేస్తున్న అధికారులు, టీచర్లు, ఆయాలను గుర్తించాలని మంత్రి సూచించారు. ఆగస్టు 15 నాటికి ఉత్తమ సేవలందిస్తున్న వారిని ఎంపిక చేసి సన్మానించేలా కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి జిల్లా నుంచి ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇద్దరు టీచర్లతో త్వరలో సమావేశమై వారి సమస్యలను వింటామని తెలిపారు. క్షేత్రస్థాయిలో బాగా పనిచేసే సిబ్బంది అనుభవాలు, సూచనలను స్వీకరించి వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. వచ్చే నెల 16, 17 తేదీల్లో మళ్లీ సమీక్షిస్తా. ఈ నెల రోజుల కాలాన్ని సవాలుగా తీసుకుని పనిచేయండి. కష్టపడి, బాధ్యతతో పనిచేస్తే ప్రజల విశ్వాసం, అభిమానం తప్పకుండా పొందుతాం అని మంత్రి సీతక్క అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు బి. అపర్ణ, మర్రిపల్లి చందన, ప్రేమలతా అగర్వాల్, కంచర్ల వందనగౌడ్, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి శృతి ఓజా, టీజీ ఫుడ్స్ ఎండీ చంద్రశేఖర్ రెడ్డి, జాయింట్ డైరెక్టర్ మోతి, పంచాయతీరాజ్ ఈఎన్సీ జోగా రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు అంగన్‌వాడీ కేంద్రాలు, శిశు విహార్‌ల సందర్శన సందర్భంగా తమకు ఎదురైన అనుభవాలు, గుర్తించిన అంశాలు, సూచనలను సమావేశంలో వివరించారు. కమిషన్ సభ్యుల సూచనలను పరిగణనలోకి తీసుకుని మహిళా, శిశు సంక్షేమ శాఖ సేవలను మరింత మెరుగుపరచాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు.

# ఫెర్టిలిటీ చికిత్స తీసుకునే ముందు దంపతులు కచ్చితంగా ఈ విషయాలను తెలుసుకోవాలి..

సంతానలేమి చికిత్స (ఫెర్టిలిటీ ట్రీట్‌మెంట్) ను ప్రారంభించే ముందు సరైన క్లినిక్‌ను ఎంచుకోవడం అత్యంత కీలకమైన నిర్ణయం. ఇది కేవలం వైద్య చికిత్స మాత్రమే కాదు.. సమయం, భావోద్వేగాలు, ఆర్థిక వ్యయం, భవిష్యత్తుపై ఆశలతో ముడిపడి ఉంటుంది. అందుకే ఫెర్టిలిటీ క్లినిక్‌లో చికిత్స ప్రారంభించే ముందు మహిళలు కొన్ని ముఖ్యమైన



ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు తెలుసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ముందుగా తమ వ్యక్తిగత పరిస్థితిని బట్టి గర్భం దాల్చే అవకాశాలు ఎంత వరకు ఉన్నాయో వైద్యులను అడగాలి. ప్రతి మహిళకు ఫలితాలు ఒకేలా ఉండవు. వయస్సు, వైద్య చరిత్ర, సంతానలేమికి కారణం, మొత్తం ఆరోగ్య పరిస్థితి వంటి అంశాల ఆధారంగా విజయావకాశాలు మారుతాయి. మంచి క్లినిక్ సాధారణ గణాంకాలు చెప్పకుండా, వ్యక్తిగత పరిస్థితిని విశ్లేషించి వాస్తవ పరిస్థితిని వివరిస్తుంది.

**ఏ చికిత్స ఎందుకని అడగాలి..**

అలాగే ఎందుకు ఈ చికిత్సనే సూచిస్తున్నారో తెలుసుకోవడం కూడా అవసరం. ప్రతి సమస్యకు నేరుగా ఐవీఎఫ్ అవసరం ఉండదు. ఇతర చికిత్సా మార్గాలు ఉన్నాయా? వాటిని ఎందుకు సూచించడం లేదు? అనే విషయాలను వైద్యులను అడగాలి. ఈ సమాధానాలు క్లినిక్ వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా చికిత్స అందిస్తుందా లేదా అనేది అర్థం చేసుకునేందుకు ఉపయోగపడతాయి. చికిత్సలో ఎవరు పాల్గొంటారు? అనే విషయాన్ని కూడా ముందుగానే తెలుసుకోవాలి. ఫెర్టిలిటీ చికిత్సను ఒక్క వైద్యుడు మాత్రమే నిర్వహించరు. ఎంబ్రియాలజిస్టులు, నర్సులు, కౌన్సిలర్లు, ల్యాబ్ నిపుణులు కూడా ఇందులో భాగస్వాములవుతారు. సందేహాలు వచ్చినప్పుడు ఎవరిని సంప్రదించాలి? మొత్తం చికిత్సలో ఒకే బృందం సేవలు అందిస్తుందా? వంటి అంశాలను అడిగి తెలుసుకోవాలి.

**రోగి భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నారా..**

అదేవిధంగా రోగి భద్రతకు క్లినిక్ ఎంత ప్రాధాన్యం ఇస్తోంది? అనేది కూడా ముఖ్యమైన ప్రశ్న. చికిత్స ప్రయోజనాలతో పాటు దాని పరిమితులు, ప్రమాదాల గురించి కూడా వైద్యులు వివరించాలి. అంతేకాకుండా సంప్రదింపులు, ×ఎఫ్‌ ప్రక్రియ, అండాల సేకరణ, నిల్వ వంటి అన్ని సేవలు ఒకే కేంద్రంలో అందుబాటులో ఉంటే గోప్యత, భద్రత, చికిత్సలో నిరంతరత మెరుగ్గా ఉంటాయి. చికిత్స మొత్తం ఖర్చు ఎంత అవుతుంది? అనే అంశంపై కూడా పూర్తి వివరాలు తీసుకోవాలి. ప్రారంభ ప్రక్రియతో మాత్రమే ఖర్చు ముగియదు. మందులు, పరీక్షలు, అండాలు లేదా ఎంబ్రియో నిల్వ ఛార్జీలు, ఇతర అదనపు సేవలు కూడా వ్యయంలో భాగమవుతాయి. పారదర్శకత ఉన్న క్లినిక్ ముందుగానే అన్ని ఖర్చుల వివరాలు తెలియజేస్తుంది.

# ప్రోటీన్ కంటే పెప్టైడ్స్ బెటరా? అసలు నిజాలివే!




కొంతకాలం క్రితం వరకు హెల్త్ అండ్ ఫిట్‌నెస్ ప్రపంచంలో ‘ప్రోటీన్’ అనే పదం పెద్ద బజ్‌ను క్రియేట్ చేసింది. ప్రోటీన్ బార్లు, పౌడర్లు, స్నాక్స్‌తో మార్కెట్ నిండిపోయింది. కానీ ఇప్పుడు ఆ స్థానాన్ని ‘పెప్టైడ్స్’ ఆక్రమిస్తున్నాయి. బరువు తగ్గడం, మెరిసే చర్మం, దీర్ఘాయువు, కండరాల రికవరీ ఇలా అన్నింటికీ పెప్టైడ్స్ ఓ అద్భుత పరిష్కారమంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరు గుతోంది. అయితే.. ఇది తాత్కాలిక ట్రెండ్ మాత్రమే కాదని, దీని వెనుక సైన్స్ ఉందని నిపుణులు చెబుతున్నారు.శాస్త్రీయంగా చూస్తే పెప్టైడ్స్ అనేవి మన శరీరంలో సహజంగానే ఉత్పత్తయ్యే అమైనో యాసిడ్ల చిన్న గొలుసులు. ఇవి శరీరంలోని కణాలు ఒకదానితో మరొకటి కమ్యూనికేట్ చేసుకోవడానికి ‘సిగ్నలింగ్ మాలిక్యూల్స్’లా పనిచేస్తాయి. కణజాలాల మరమ్మతు, రోగనిరోధక శక్తి, జీవక్రియ, ఆకలి నియంత్రణ వంటి అనేక శారీరక ప్రక్రియలను సమన్వయం చేయడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. మన శరీరం సక్రమంగా పనిచేయడానికి ఇవి అంతర్గత సహాయకులుగా నిలుస్తాయి.ప్రస్తుతం బరువు తగ్గడానికి వాడుతున్న కొన్ని రకాల ఇంజెక్షన్లలో ఉండే ‘జీఎల్పీ-1’ పెప్టైడ్స్ ఆకలిని నియంత్రించి, కడుపు నిండిన భావనను కలిగిస్తాయి. అందుకే బరువు తగ్గాలనుకునే వారిలో వీటికి ఆదరణ పెరిగింది. అలాగే వృద్ధాప్య ఛాయలను తగ్గించడానికి, జీర్ణవ్యవస్థను మెరుగుపరచడానికి కూడా ఇవి ఉపయోగపడతాయని పరిశోధనల్లో తేలింది. జబ్బులు వచ్చాక వైద్యం చేయించుకోవడం కంటే, రాకుండా చూసుకోవాలనే ఆలోచన ప్రజల్లో పెరగడం వల్ల కూడా ఈ పెప్టైడ్స్ ట్రెండ్ వేగంగా విస్తరిస్తోంది.అయితే.. పెప్టైడ్స్ అనేవి అన్ని సమస్యలనూ పరిష్కరించేది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సరైన పోషకాహారం, తగినంత నిద్ర, ఒత్తిడి లేని జీవితం, క్రమబద్ధమైన వ్యాయామం వంటి ప్రాథమిక ఆరోగ్య సూత్రాలను పక్కనబెట్టి, కేవలం పెప్టైడ్స్ వల్లనే ఆరోగ్యం వచ్చేస్తుందని నమ్మడం పొరపాటు అంటున్నారు.




# 'మల్లు అర్జున్' ఫేమ్ డబుల్ కానుందా? అంతకుమించా?



అల్లు అర్జున్ కు కేరళలో ఫ్యాన్ బేస్ ఒక్కరోజులో రాలేదని చెప్పాలి. దాదాపు రెండు దశాబ్దాలుగా ఆయన సినిమాలు అక్కడ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నాయి. తెలుగులో ఐకాన్ స్టార్.. నార్త్ లో పుష్ప రాజ్.. కానీ కేరళలో మాత్రం ఆయన పేరు వేరే. అక్కడ అల్లు అర్జున్ ను అభిమానులు ప్రేమగా మల్లు అర్జున్ అని పిలుస్తారు. ఓ వేరే లాంగ్వేజ్ హీరోకు మరో రాష్ట్రంలో ఇంతటి ఫ్యాన్ బేస్ ఉండటం రేర్. ఇప్పుడు మాలీవుడ్ దర్శకుడు బాసిల్ జోసెఫ్ తో అల్లు అర్జున్ సినిమా చేసే అవకాశాలపై మళ్లీ చర్చ మొదలవడంతో, కేరళలో బన్నీ క్రేజ్ మరో స్థాయికి వెళ్లే అవకాశం కనిపిస్తోంది. అల్లు అర్జున్ కు కేరళలో ఫ్యాన్ బేస్ ఒక్కరోజులో రాలేదని చెప్పాలి. దాదాపు రెండు దశాబ్దాలుగా ఆయన సినిమాలు అక్కడ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నాయి. ముఖ్యంగా డబ్బింగ్ చిత్రాల ద్వారా బన్నీ మాలీవుడ్ ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యారు. ఆర్య, బన్నీ, దేశముదురు, హ్యాపీ వంటి చిత్రాలు మలయాళంలోకి డబ్ అయ్యి మంచి విజయాలు సాధించాయి. ఆ సినిమాల్లో కనిపించిన స్టైల్, డ్యాన్సులు, ఎనర్జీ యూత్ ను బాగా ఆకట్టుకున్నాయి. ఆ తర్వాత వచ్చిన రేసుగుర్రం, సరైనోడు వంటి సినిమాలు కూడా అక్కడ మంచి రెస్పాన్స్ పొందాయి.ఇక పుష్పతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. పాన్ ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించిన ఆ చిత్రం కేరళలో కూడా భారీ విజయాన్ని నమోదు చేసింది. ఫహాద్ ఫాజిల్ కీలక పాత్ర పోషించడం కూడా సినిమాపై మరింత ఆసక్తి పెంచింది. పుష్ప 2 విడుదల సమయంలో కేరళలో కనిపించిన హడావిడి చూస్తే, అక్కడ అల్లు అర్జున్ కు ఉన్న ఫాలోయింగ్ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. కేరళ ఆడియన్స్ చూపిస్తున్న ప్రేమకు బన్నీ కూడా ప్రత్యేక గౌరవం ఇస్తుంటారు. పలుమార్లు కేరళను తన రెండో ఇంటిలా భావిస్తున్నానని చెప్పారు. అక్కడ జరిగే ప్రతిష్టాత్మక కార్యక్రమాలకు కూడా ఆయన చీఫ్ గెస్ట్ గా హాజరయ్యారు. అందుకే మాలీవుడ్ ప్రేక్షకులు ఆయనను తమ హీరోగానే చూస్తుంటారు. ఇప్పుడు మళ్లీ బాసిల్ జోసెఫ్ పేరు తెరపైకి రావడం ఆసక్తికరంగా మారింది. ఇటీవల సోషల్ మీడియాలో ఆయన చేసిన ఒక పోస్ట్ అభిమానుల దృష్టిని ఆకర్షించింది. దీంతో అల్లు అర్జున్-బాసిల్ జోసెఫ్ కాంబోపై మళ్లీ ఊహాగానాలు మొదలయ్యాయి.గతంలో కూడా ఆ కాంబో గురించి వార్తలు వచ్చాయి. కానీ తర్వాత ఇతర ప్రాజెక్టులు ముందుకు రావడంతో ఆ చర్చ స్లో అయింది. బాసిల్ ను కేవలం దర్శకుడిగానే కాకుండా కొత్త ఆలోచనలతో సినిమాలు చేసే వ్యక్తిగా గుర్తిస్తారు. మిన్నల్ మురళి వంటి సూపర్ హీరో చిత్రంతో ఆయన తన ప్రత్యేకతను చాటుకున్నారు.

# పెళ్లికి ముందే భార్యలా విశాల్ కు సేవలు!




'సాయిధన్షిక నా అతిపెద్ద సపోర్ట్ సిస్టమ్ అని విశాల్ ఆప్యాయంగా చెప్పారు. చిత్ర నిర్మాణంలో ఎన్నో సవాళ్లు ఎదురైనప్పుడు పక్కనే ఉండి తనకు మనోధైర్యాన్ని అందించారన్నారు. రెండు దశాబ్దాలుగా యాక్షన్ హీరోగా ప్రేక్షకులను అలరిస్తున్న విశాల్ కెరీర్‌లో సరికొత్త అడుగులు వేస్తున్నారు. నటుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న విశాల్ ఇప్పుడు 'మకుటం' చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం అవుతున్న సంగతి తెలిసిందే. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును తెరకెక్కించే క్రమంలో విశాల్ వృత్తిపరమైన బాధ్యతలతో పాటు వ్యక్తిగత జీవితంలో కొత్త అధ్యాయానికి సిద్ధమవుతున్నారు. ఈ దశలో ఆయన షూటింగ్ సెట్‌లో పడుతున్న కష్టాలను తన కాబోయే భార్య సాయిధన్షిక అందించిన మద్దతును ప్రేమతో గుర్తు చేసుకున్నారు. షూటింగ్ ..వివాహ ఏర్పాట్లు.. ఈ రెండింటినీ బ్యాలెన్స్ చేయడం ఏ నటునికైనా కష్టమైన విషయమే. అయితే 'మకుటం' చిత్రం తనకు ఎంతో ప్రత్యేకం అని విశాల్ చెబుతున్నారు. ఈ సినిమా కోసం తను పడ్డ కష్టం, ఒత్తిడిని సాయిధన్షిక దగ్గరుండి చూసిందని... ఒక భార్య వలె ఎంతో అండగా నిలిచారని విశాల్ పేర్కొన్నారు. షూటింగ్ సెట్‌లో తాను పడుతున్న శ్రమను గమనించి ప్రతి క్షణం ధైర్యం చెప్పడం ఎంతో ఊరటనిచ్చిందన్నారు. 'సాయిధన్షిక నా అతిపెద్ద సపోర్ట్ సిస్టమ్ అని విశాల్ ఆప్యాయంగా చెప్పారు. చిత్ర నిర్మాణంలో ఎన్నో సవాళ్లు ఎదురైనప్పుడు పక్కనే ఉండి తనకు మనోధైర్యాన్ని అందించారన్నారు. ఈ సినిమా కోసం సర్వస్వాన్ని అంకితం చేయాల్సి వచ్చిందని ఆ క్రమంలో సాయి ఏనాడు ఫిర్యాదు చేయకుండా తన బాధ్యతలను భుజాన వేసుకున్నారని సంతోషం వ్యక్తం చేశారు. తన విజయంలో సాయి ధన్షిక పాత్ర మరువ లేనిదన్నారు. మొత్తానికి పెళ్లికి ముందే సాయి ధన్షిక విశాల్ కు ఓ భార్యలా అన్ని రకాలుగా మద్దతుగా నిలుస్తు న్నారు. వివాహానికి ముందు చాలా జోడీలు డేటింగ్ పేరుతో కలిసి ఉంటారు. ఈ సమయంలోనే ఒకర్ని ఒకరు అర్దం చేసుకుంటారు. ఆ సమయంలో ఇద్దరి మధ్య అండర్ స్టాండింగ్ ఎలా ఉందో చూసుకుంటారు. అక్కడ టెర్మ్స్ అన్ని కుదిరితేనే పెళ్లి వరకూ వెళ్తారు. లేదంటే డేటింగ్ తో సరిపెట్టి ఎవరి దారి వారు చూసు కుంటారు. కానీ విశాల్ అలాంటి వాటికి భిన్నంగా సాయిధన్షికతో ప్రయాణాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. వ్యక్తిగతంగా కలిసి ఉండటం కంటే? వృత్తిపరంగా విశాల్ కు ముందే అండగా నిలబడుతున్నారు. పని అంటే? పారిపోయే ఈ రోజుల్లో ఇలా నిలబడటం గొప్ప విషయం. విశాల్- సాయి ధన్షికల వివాహం ఆగస్టులో జరగనుంది. విశాల్ తదుపరి సినిమాల విషయానికి వస్తే పూర్తి చేయాల్సిన ప్రాజెక్ట్ లు చాలానే ఉన్నాయి. -డిటెక్టివ్ 2- చిత్రాన్ని ఇప్పటికే ప్రేక్షకుల ముందుకు తీసుకు రావాలి. కానీ ఆ చిత్రం చాలా కాలంగా వాయిదా పడుతోంది. ఈ చిత్రానికి కూడా విశాల్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిఆను విశాల్ ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నారు.

# రా ఎన్టీఆర్ ఎం ఎన్టీఆర్ టీమ్.. అసలేం జరుగుతోంది?




ఇటీవల జూలై 18న ఎన్టీఆర్ రాజకీయాలకు సంబంధించిన కీలక ప్రకటన చేయబోతున్నారంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ చుట్టూ గత కొన్ని రోజులుగా పొలిటికల్ ఎంట్రీపై ప్రచారం జరుగుతుండగా, ఇప్పుడు మరో కొత్త వివాదం తెరపైకి వచ్చింది. ఎన్టీఆర్ అభిమానుల కోసం, సేవా కార్యక్రమాల కోసం పనిచేస్తున్నామని చెప్పుకుంటున్న రా ఎన్టీఆర్ (=ూౌ చీు=) సంస్థ ఒకవైపు ఉంటే, ఆ సంస్థతో తమకు ఎలాంటి సంబంధం లేదని ఎన్టీఆర్ టీమ్ ప్రకటించడం మరోవైపు చర్చకు దారి తీసింది. దీంతో అసలు ఎవరిది నిజం? రా ఎన్టీఆర్ సంస్థ ప్లేస్ ఏమిటి? అనే ప్రశ్నలు అభిమానుల్లో మొదలయ్యాయి. ఇటీవల జూలై 18న ఎన్టీఆర్ రాజకీయాలకు సంబంధించిన కీలక ప్రకటన చేయబోతున్నారంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. ఆ ప్రచారంలో రా ఎన్టీఆర్ సంస్థ పేరు కూడా వినిపించింది. దీంతో ఆ వ్యవహారంపై స్పందించిన ఎన్టీఆర్ కార్యాలయం అధికారిక ప్రకటన విడుదల చేసింది. రా ఎన్టీఆర్ అనే సంస్థకు ఎన్టీఆర్ తో, ఆయన కార్యాలయంతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. ఎన్టీఆర్ పేరుతో కార్యక్రమాలు నిర్వహించే హక్కు ఆ సంస్థకు లేదని కూడా పేర్కొంది. అంతేకాదు, ఎన్టీఆర్ కు సంబంధించిన ఏ సమాచారం అయినా అఫీషియల్ టీమ్ ద్వారా వెలువడుతుందని తెలిపింది. సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్ ఫామ్స్ లేదా ఇతర సంస్థల ద్వారా వచ్చే ప్రచారాన్ని అఫీషియల్ ఇన్ఫర్మేషన్ గా పరిగణించవద్దని విజ్ఞప్తి చేసింది. అయితే ఆ ప్రకటనతో వివాదం ముగియలేదు. రా ఎన్టీఆర్ సంస్థ ఫౌండర్ సాయి రూప్ దీనిపై స్పందించారు. తమ సంస్థ ఏడేళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని, వేలాది మంది వాలంటీర్లు తమతో కలిసి పనిచేస్తున్నారని చెప్పారు. తమ ఉద్దేశం కేవలం సేవ మాత్రమేనని, రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఆ తర్వాత సాయి రూప్, ఎన్టీఆర్ కార్యాలయం పేరుతో విడుదలైన లేఖపైనే సందేహాలు వ్యక్తం చేశారు. ఆ లెటర్ గురించి ఎన్టీఆర్ కే తెలిసి ఉండకపోవచ్చని వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్ స్వయంగా వచ్చి ఆపమంటే వెంటనే అన్ని కార్యక్రమాలు నిలిపివేస్తామని చెప్పారు. తమకు ఎన్టీఆర్ అంటే దేవుడితో సమానమని, ఆయన పేరు ద్వారా సేవా కార్యక్రమాలు చేయడమే తమ లక్ష్యమని తెలిపారు.అదే సమయంలో అభిమాన సంఘాల మధ్య విభేదాలు బయటపడుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎవరు అభిమానులు? ఎవరు ఎన్టీఆర్ కు దగ్గరగా ఉన్నవారు? అనే చర్చ సోషల్ మీడియాలో జరుగుతోంది. కొందరు ఎన్టీఆర్ కార్యాలయం ప్రకటన ఫైనల్ గా భావిస్తుండగా, మరికొందరు రా ఎన్టీఆర్ గత సేవా కార్యక్రమాలు ప్రస్తావిస్తున్నారు. ఎన్టీఆర్ పేరును ఉపయోగిస్తూ అనేక కార్యక్రమాలు నిర్వహించినా, ఇప్పుడు టీమ్ అలా స్పందించడం హాట్ టాపిక్ గా మారింది.

# మహేష్ ఫ్యాన్స్‌కు సర్‌ప్రైజ్.. బర్త్ డే ట్రీట్‌గా ఎపిక్ బ్లాక్‌బస్టర్..!




సూపర్ స్టార్ మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులకు ఒక అదిరిపోయే క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. మహేష్ బాబు కెరీర్‌లోనే ట్రెండ్ సెట్టర్‌గా నిలిచిన బ్లాక్‌బస్టర్ మూవీ 'పోకిరి' రీ-రిలీజ్ కాబోతోంది.అయితే ఈసారి కేవలం సాధారణ రీ-రిలీజ్ షోలు మాత్రమే కాకుండా, రీ-రిలీజ్ చిత్రాల చరిత్రలోనే తొలిసారిగా ఆగస్టు 9వ తేదీన స్పెషల్ మిడ్‌నైట్ షోలు ప్లాన్ చేస్తున్నారు. ఇలా ఓ రీ-రిలీజ్ చిత్రానికి కూడా మిడ్ నైట్ షోలు పడటం చాలా అరుదు.ాధారణంగా పెద్ద హీరోల కొత్త సినిమాలకు మాత్రమే ఉండే ఈ అర్ధరాత్రి షోల హడావుడిని, ఇప్పుడు ఒక రీ-రిలీజ్ సినిమాకు ప్లాన్ చేయడం సరికొత్త ట్రెండ్‌కు తెరలేపింది. పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన ఈ ఇండస్ట్రీ హిట్ సినిమా అంటే మహేష్ ఫ్యాన్స్‌కు ఎప్పటికీ పూనకాలే. మరి ఆగస్టు 9న థియేటర్లలో పండగ చేసుకోవడానికి, పాత రికార్డులను తిరగరాయడానికి సూపర్ స్టార్ అభిమానులు ఇప్పుడే సిద్ధమైపోతున్నారు.

# సాలిడ్ బుకింగ్స్‌తో 'లెనిన్' స్ట్రాంగ్ హోల్డ్..!




అక్కినేని అఖిల్ రూరల్ యాక్షన్ డ్రామా 'లెనిన్' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద సాలిడ్ కమ్‌బ్యాక్ ఇచ్చాడు. మురళి కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం, ప్రస్తుతం థియేటర్లలో భారీ వసూళ్లతో దూసుకుపోతూ బయ్యర్లకు లాభాల పంట పండిస్తోంది. ఈ సినిమా సాధిస్తున్న విజయానికి మంచి కంటెంట్, నటీనటుల ప్రతిభతో పాటు అందుబాటులో ఉన్న టికెట్ ధరలు కూడా ప్రధాన కారణమయ్యాయి. ఇప్పటివరకు బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ యాప్ ప్లాట్‌ఫారమ్‌లలో కలిపి ఏకంగా 1.5 మిలియన్లకు పైగా టికెట్లు అమ్ముడవడం విశేషం. ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించింది. మనం ఎంటర్‌ప్రైజెస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి ఎస్. థమన్ సంగీతం అందించాడు. శివాజీ, ప్రమోద్ పంజు, ఈశ్వరి రావు, సునీల్, రామ్కీ, బ్రహ్మాజీ తదితరులు కీలక పాత్రలు పోషించారు

# సమంత సీమ వంటకాలు నేర్చుకుంటుందా?

సమంత వ్యక్తిగత జీవితంలో తీసుకుంటున్న మార్పులు - అభిరుచులు సినీ వర్గాల్లో ఆసక్తికరంగా మారుతున్నాయి. సమంత వ్యక్తిగత జీవితంలో తీసుకుంటున్న మార్పులు - అభిరుచులు సినీ వర్గాల్లో ఆసక్తికరంగా మారుతున్నాయి. నాగ చైతన్యతో వివాహం జరిగిన సమయంలో తనకు వంట చేయడం పెద్దగా రాదని, వంట గదిలో గడపడం కంటే పని మీదనే ఎక్కువ దృష్టి పెడతానని బహిరంగంగానే వెల్లడించారు. తాజాగా అదే సమంత మనసంతా వంటగదిపైనే ఉందన్నది ఇప్పుడు అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ప్రస్తుతం రాయలసీమ రుచులను నేర్చుకోవడంలో నిమగ్నమైందని తెలిసింది. రాయలసీమ వంటకాలు అనగానే ఘాటైన మసాలాలు, ప్రత్యేకమైన తయారీ పద్ధతులు గుర్తుకొస్తాయి. సామ్ సన్నిహితుల ద్వారా అందుతున్న సమాచారం ప్రకారం సమంత ఎంతో శ్రద్ధగా ఈ వంటకాలను నేర్చుకుంటున్నారు. ముఖ్యంగా సీమ రుచుల ప్రత్యేకతను ఎంతో ఎంజాయ్ చేస్తున్నారని తెలిసింది. ఒకప్పుడు వంటకు దూరంగా ఉన్న సమంత ఇప్పుడు ఇష్టంగా వంటగదిలో సమయం గడపడం అభిమానుల్ని సర్ ప్రైజ్ చేస్తుంది. సమంత ఈ నిర్ణయం తీసుకోవడానికి ఆమె వ్యక్తిగత జీవితంలో జరిగిన పరిణామాలే కారణమని నెటిజన్లు భావిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సమంత ఇంటికే పరిమితమై, ప్రశాంతమైన జీవనాన్ని గడుపుతున్నారు. గర్భవతి కావడంతో ఈ సమయంలో బయట తిరుగుళ్లు తగ్గించి ఇంట్లోనే ఉండటం ఆమెకు వంటపై ఆసక్తిని పెంచేలా చేసిందని తెలుస్తోంది.



ఇంటి వాతావరణం, కుటుంబ సభ్యుల మధ్య గడపడం కొత్త అనుభూతిని అందిస్తుందని చెప్పొచ్చు. నటిగా కెరీర్‌లో బిజీగా ఉన్నప్పుడు వంటపై దృష్టి పెట్టడం కుదరకపోవచ్చు. కానీ ఇప్పుడు లభించిన విరామ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. వంట కేవలం ఆకలి తీర్చుకోవడం మాత్రమే కాదు. అది ఒక కళ అని దానిని ఆస్వాదిస్తూ చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని సమంత కూడా భావిస్తున్నట్లు కనిపిస్తోంది. ఆరోగ్యకరమైన, రుచికరమైన ఇంటి భోజనం గర్భవతిగా ఆమెకు ఎంతో మేలు చేకూరుస్తుంది. తెలుగు వ్యక్తిని వివాహం ( రాజ్ నిడిమోరు) చేసుకున్న తర్వాత సంప్రదాయాలు , రుచులపై సమంతకు మక్కువ పెరిగిందని చెప్పడంలో సందేహం లేదు. తెలుగు వంటకాలకు, ముఖ్యంగా సీమ వంటకాలకు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆ రుచులను స్వయంగా వండి రుచి చూడటంలో ఉన్న తృప్తి వేరే ఏ ఆహారంలోనూ ఉ ఒడదు. సమంత వంటకాలను వండి కుటుంబ సభ్యులకు వడ్డించడంలో ఓ కొత్త ఆనందాన్ని పొందుతున్నారని సన్నిహితులు చెబుతున్నారు. ఇటీవలే రిలీజ్ అయిన -మా ఇంటి బంగారం- చిత్రంలో నక్సలైట్...ఓ ఇంటి కోడలి పాత్రలో ఎలా అరించారో? తెలిసిందే. వంట తెలియని సమంత వంటల్లో స్పెషలిస్ట్ అని చెప్పుకుని కుటుంబంలో హైలైట్ అవుతుంది. అది రీల్ సీన్ అయినా? ఇప్పుడు రియల్ గా రాయలసీమ వంటకాలు నేర్చుకుంటూ రియల్ గానూ అత్తింటి కుటుంబంలో మంచి వంట గత్తెను అనిపించుకుంటోంది.

Edited, Printed, Published and Owned by Bavanari Ravi kumar. Printed at M/s Manikanta Enterprises, H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Published at H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Editor: Bavanari Ravi Kumar. RNI No.TELTEL/2014/55197